రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (బుధవారం సాయంత్రం)
సహరి : 4.58 (గురువారం ఉదయం)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 19 మార్చి 2025



ఆత్మకూరులోని నారంపేట ఫేస్-2లో ఎంఎస్ఎంఈ పార్కు కోసం చదునుచేసిన స్థలం



రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పార్కుల ఏర్పాటుకు ఏపీఐఐసీ కసరత్తు ప్రారంభించింది. అయితే, ఇప్పటికే నారంపేట పేస్1 , బొడ్డువారిపాళెం, కేకేగుంట ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఉన్నాయి. వీటిని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పరిశ్రమల స్థాపన అటుంచితే ఉన్నవీ మూతపడ్డాయి.

నియోజకవర్గాల్లో
పారిశ్రామిక అడుగు

- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు
- ఇప్పటికే ఆరుచోట్ల భూముల గుర్తింపు
- వంద ఎకరాల విస్తీర్ణం తగ్గకుండా ఏర్పాటు
- ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భూసేకరణకు కసరత్తు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం.. చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో అనేక మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపు చూస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యంతోపాటు అనేక విధాలుగా ప్రోత్సాహకులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా నూతన పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయలని నిర్ణయించింది. పాత ఎంఎస్ఎంఈ పార్కుల్లో సైతం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతోపాటు రోడ్లు, నీటి వసతులు కల్పించాలని ఇప్పటికే ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు భూమిని గుర్తించాము. ఇప్పటికి ఆరు నియోజకవర్గాల్లో పూర్తయ్యింది. ఇక రెండు నియోజకవర్గాల్లో భూమి కోసం సర్వే చేస్తున్నాము. ప్రతి నియోజకవర్గంలో 50 ఎకరాలు తగ్గకుండా 100 ఎకరాలు మించకుండా ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయబోతున్నాము. ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో గుర్తించిన భూముల వివరాలను ప్రభుత్వానికి పంపాము. త్వరలోనే భూములను ఏపీఐఐసీ సేకరిస్తుంది.

- ఎల్.శివకుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం



వలేటివారిపాళెం మండలం అయ్యవారిపాళెంలో సేకరించిన భూమిలో ఏపీఐఐసీ అధికారులు

● నియోజకవర్గాల్లో భూమి గుర్తింపు

నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 6 చోట్ల పార్కుల ఏర్పాటుకు భూమిని గుర్తించారు. ప్రభుత్వ భూమి కావడంతో ఎలాంటి ఆలస్యం లేకుండా భూసేకరణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కావలి, నెల్లూరు రూరల్, సర్వేపల్లి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో భూమిని గుర్తించారు. అయితే కోవూరు, నెల్లూరు సిటీ నియోజకవర్గాల్లో భూమి కోసం సర్వే చేస్తున్నారు. వీలైనంత త్వరలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయనున్నారు.



ఆమంచర్ల ప్రాంతంలోని ఎంఎస్ఎంఈ పార్క్ కోసం ఎంపిక చేసిన భూమి

ఆరు నియోజకవర్గాల్లో గుర్తించిన భూముల వివరాలు

నియోజకవర్గం	మండలం	గ్రామం	భూమి (ఎకరాల్లో)
ఆత్మకూరు	ఆత్మకూరు	నారంపేట(ఫేస్ 2)	70.29
నెల్లూరురూరల్	నెల్లూరు(ఆర్)	ఆమంచర్ల	59.61
కావలి	దగదర్తి	ఉలవపాడు	88.22
సర్వేపల్లి	మనుబోలు	చెరుకుముడి	59.00
కందుకూరు	వీవీపాళెం	అయ్యవారిపాళెం	100.00
ఉదయగిరి	దుత్తలూరు	దుత్తలూరు	50.00

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

కలిగిరి/మర్రిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి మూడేళ్లుగా పొగాకు రైతులకు మార్కెట్ అనుకూలించడంతో రికార్డుస్థాయి ధరలు దక్కాయి. పొగాకు బోర్డు కూడా గతేడాది అధిక ఉత్పత్తికి అనుమతులు ఇవ్వడంతో ఎక్కువమంది పొగాకు సాగుకు మొగ్గుచూపారు. జిల్లాలోని డీసీపల్లి, కలిగిరి వేలం కేంద్రాల్లో బుధవారం పొగాకు వేలం ప్రారంభం కానుంది. 2024-25 పంట కాలానికి నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోని 11 వేలం కేంద్రాల పరిధిలో 103 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి వస్తుందని అంచనా వేయగా 163 మిలియన్ కిలోలు దిగుబడులు రావచ్చని అధికారు లు అంచనా వేస్తున్నారు. ఎస్ఎల్ఎస్ (దక్షిణాది తేలిక నేలలు) పరిధిలోని కలిగిరి, డీసీపల్లి, కందుకూరు-1,2, పొదిలి, కనిగిరి వేలం కేంద్రాల్లో ఈ ఏడాది 56 మిలియ న్ కిలోలకు అనుమతి లభించింది. బుధవారం నుంచి జరిగే కొనుగోళ్లలో కిలో ధర రూ.280కి తగ్గకుండా ఉంటే బాగుంటుందని రైతులు భావిస్తున్నారు.



సమీక్షలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ధాన్యం మద్దతు ధరపై మంత్రుల సమీక్ష

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడం, రైతులకు కలుగుతున్న ఇబ్బందులపై మంగళవారం అమరావతిలో మంత్రులు, ఎమ్మెల్యేలు సమీక్షించారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, ఎన్ఎండీ ఫరూక్, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. బీపీటీ రకం పంట పండించిన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రులకు వివరించారు. కనీస మద్దతు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. బుధవారం కలెక్టర్‌తోపాటు జిల్లా ప్రత్యేక అధికారితో సమీక్షించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ 4 మండలాలకు
తహసీల్దార్లు ఏరీ!?

- నెలల తరబడి ఇన్‌చార్జ్‌లతో పాలన
- ప్రజలకు తప్పని అవస్థలు

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. నాటి వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని జిల్లాలో భూ సమస్యలు విపరీతమయ్యాయి. గ్రామసభలు పెట్టినా, రెవెన్యూ సదస్సులు నిర్వహించినా, ఆఖరుకు ప్రతి వారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి కూడా కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చి పడుతున్నాయి. వీటని వేగంగా పరిష్కరించాలని పభుత్వం పదే పదే ఆదేశిస్తోంది. ఇంతటి కీలక సమయంలో రెగ్యులర్ తహసీల్దార్లు లేకపోవడంతో ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. నాలుగు కీలక మండలాలకు నెలల తరబడి రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. పొదలకూరు, ముత్తుకూరు, టీపీ గూడూరు, మర్రిపాడు మండలాలు ఈ జాబితాలో ఉన్నాయి.

● టీపీ గూడూరు మండలానికి ఎనిమిది నెలల క్రితం బదిలీల్లో భాగంగా ఓ తహసీల్దార్‌ను ఇక్కడకు వేశారు. అయితే ఆమె కొన్ని రోజులకే సెలవుపెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి కొత్తవారిని నియమించలేదు. ఇందుకూరుపేట తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు.

● ముత్తుకూరు మండలంలో పని చేస్తున్న తహసీల్దార్ నాలుగు నెలల క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ తర్వాత ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. వెంకటాచలం తహసీల్దార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు.

● మర్రిపాడు తహసీల్దార్ మూడు నెలల క్రితం ప్రసూతి సెలవుపై వెళ్లారు. ఇక్కడా మరొ కరిని నియమించకుండా డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకున్నారు.

● పొదలకూరు తహసీల్దారు నెలరోజుల క్రితం సెలవుల్లో వెళ్లారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దారు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఒక్కో మండలంలో ఇన్నేసి నెలలపాటు రెగ్యులర్ తహసీల్దార్ లేకపోతే అక్కడి సమస్యలను ఎలా పరిష్కరించాలన్న ఆలోచన ఉన్నతాధికారులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. డిసెంబరు, జనవరి నెలల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో జిల్లాలోనే అత్యధికంగా మర్రిపాడు మండలంలో 689 భూసమస్యలు నమోదయ్యాయి. ముత్తుకూరులో 161, టీపీ గూడూరులో 93, పొదలకూరులో 46 అర్జీలు వచ్చాయి. అలానే అంతకముందు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో మర్రిపాడు మండలంలో 35 అర్జీలు రాగా, టీపీ గూడూరులో 345 అర్జీలు, పొదలకూరులో 538, ముత్తుకూరులో 48 అర్జీలు నమోదయ్యాయి. ఈ సంఖ్యను బట్టి చూస్తేనే ఆ మూడు మండలాల్లో రెవెన్యూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. అయితే రెగ్యులర్ తహసీల్దార్లు లేని మూలంగా ఈ సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌లుగా ఉన్న తహసీల్దార్లు ఎక్కువగా వారి రెగ్యులర్ మండలాలపైనే దృష్టి పెడుతున్నారు. దీంతో సాధారణ పనులపై తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా అసౌకర్యంగా ఉంటోంది. అదే సమయంలో ప్రస్తుతం కీలకమైన రీసర్వే జరుగుతోంది. గత ప్రభుత్వంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. మరి ఇప్పుడు నాలుగు కీలక మండలాలకు నెలల తరబడి రెగ్యులర్ తహసీల్దార్లను నియమించకపోవడం కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది.



ఇసుక తవ్వకాలకు
బ్రేక్!

జిల్లాలో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. డీసిల్టేషన్ పాయింట్ల వద్ద డ్రెడ్జింగ్‌కు గడువు ముగియడంతో పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఈ నెల 11 నుంచి తవ్వకాలు ఆగిపోయాయి. దీనిమూలంగా రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉత్పత్తి ఆగిపోయింది. ఈ లెక్కన చూస్తే గడిచిన వారం రోజుల వ్యవధిలో తీయాల్సిన సుమారు 35 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ ప్రభావంతో యార్డుల్లో ఉన్న నిల్వలు కరుగుతున్నాయి. ఇది భవిష్యత్ అవసరాలపై ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గడువు ముగుస్తుం దని తెలిసినా.. డీసిల్టేషన్‌పై అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈపాటికి ఏదో ఒక నిర్ణయం తీసుకొని ఉంటే ఇసుక ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా ఉండేది. కాగా ప్రస్తుతం జిల్లాలో ఒక్క పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లో మాత్రమే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి.

- 4 డీసిల్టేషన్ పాయింట్లకు ముగిసిన గడువు
- వారం రోజులుగా ఆగిపోయిన తవ్వకాలు
- యార్డుల్లో కరుగుతున్న నిల్వలు
- టెండర్‌లా.. పొడిగింపా!? నిర్ణయం తీసుకోని అధికారులు
- మరో రెండు నెలల్లో రానున్న మాన్‌సూన్స్
- ఆ తర్వాత తవ్వకాలకు అవకాశం లేనట్టే!

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గతేడాది కొత్త ప్రభుత్వం కొలువు దీరాక ఇసుకను ఉచితం చేసింది. దీంతో అప్పటి వరకూ ఇసుకకు ఉన్న డిమాండ్ ఒక్కసారిగా తగ్గిపోయింది. ప్రభుత్వం ఏర్పడినది మాన్‌సూన్ సీజన్లో కావడంతో అప్పుడు పెన్నా నదిలో ఇసుక తవ్వకాలు జరిపే వీల్లేకుండా పోయింది. నాడు యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను ప్రజలకు అందించారు. ఆ తర్వాత డీసిల్టేషన్‌కు అనుమతులిచ్చి డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మొదలయ్యాక ఇసుక మరింతగా అందుబాటులోకి వచ్చింది. అదే సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లే విధానం ప్రవేశపెట్టడంతో ఇసుక కష్టాలు పూర్తిగా తీరాయి. కాగా ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం పుంజుకుంటోంది. అదే సమయంలో పరిశ్రమల ఏర్పాటులో కూడా కదలిక మొదలైంది. రామాయపట్నం పోర్టుతో పాటు ఆ చుట్టు పక్కల పెద్ద పెద్ద పరిశ్రమల పనులు జరుగుతున్నాయి. త్వరలోనే కృష్ణపట్నం నోడ్‌లో కూడా పరిశ్రమల నిర్మాణం మొదలుకాబోతోంది. ఈ నేపథ్యంలో ఇసుకకు డిమాండ్ పెరుగుతుంది. అయితే జూన్ నుంచి మాన్‌సూన్ సీజన్ ప్రారంభం కానుంది. అప్పుడు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం నదిలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీలుండదు. కాబట్టి ఈ లోపే వీలైనంత ఎక్కువగా ఇసుకను తవ్వి నిల్వ చేసుకోవాలి. మళ్లీ అక్టోబరు నుంచి తవ్వకాలు జరుపుకునేందుకు అవకాశం ఉన్నా ఆ సమయంలో జిల్లాలో వర్షాకాలం ప్రారంభమవుతుంది. అప్పుడు ట్రాక్టర్లు నదిలోకి వెళ్లడం సాధ్యపడదు. కాబట్టి ఈ ఏడాది చివరి నాటికి అవసరమయ్యే ఇసుకను వీలైనంతగా రానున్న రెండు, మూడు నెలల్లోనే స్టాక్ చేసుకుంటే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● త్వరగా నిర్ణయం తీసుకోవాలి

ప్రస్తుతం జిల్లాలోని యార్డుల్లో 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. అత్యధికంగా సంగం యార్డులో 72 వేల టన్నులు ఉండగా, సూరాయపాలెంలో 38 వేలు టన్నులు, విరువూరులో 5 వేలు టన్నులు, పడమటికంభంపాడు యార్డులో మరో 5 వేల టన్నుల ఇసుక ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో ఈ యార్డుల నుంచి ప్రస్తుతం రోజుకు రెండు వేల టన్నుల వరకూ విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ పరిమాణం రానున్న రోజుల్లో మరింత పెరుగుతుంది. కాబట్టి డీసిల్టేషన్ పాయింట్ల వద్ద డ్రెడ్జింగ్‌పై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అక్కడ రోజుకు చేస్తున్న 5 వేల టన్నుల ఉత్పత్తిని మరింత పెంచుకోగలిగితే భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది లేకుండా నిల్వలు పెట్టుకునేందుకు వీలు పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్ణయం తీసుకుంటాం

డీసిల్టేషన్ పాయింట్ల వద్ద డ్రెడ్జింగ్‌కు గడువు ముగిసింది. ఇక్కడ డ్రెడ్జింగ్ చేయడంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. కొత్తగా టెండర్లు పిలవడమా లేదా ఉన్న అగ్రిమెంట్‌నే కొంతకాలం పొడగించడమా.. అన్నది కమిటీలో చర్చిస్తాం. భవిష్యత్ అవసరాలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటాం.

- ఓ ఆనంద్, కలెక్టర్



దుత్తలూరు గోదాములోని సిమెంట్ నిల్వలను పరిశీలిస్తున్న విచారణ అధికారులు

'గూడు' పురాణిపై
విచారణ

- ఫిర్యాదుల నేపథ్యంలో రంగంలోకి అధికారులు
- సిమెంట్, ఇసుక, స్టీలు చేతివాటంపై ఆరా
- జిల్లాలోని గోదాములన్నీ పరిశీలన
- నెలాఖరుకు కలెక్టరుకు నివేదికలు
- ఇప్పటికే కొంతమంది అక్రమార్కులపై వేటు

నెల్లూరు(జడ్పీ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) గత వైసీపీ హయాంలో పక్కా ఇళ్ల నిర్మాణాల పేరుతో జరిగిన అవినీతి, అక్రమాలపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు విచారణ వేగవంతం చేశారు. జగనన్న లేఅవుట్లు, పాత ఇళ్ల నిర్మాణాల్లో వినియోగించాల్సిన సిమెంటు, ఇసుక, స్టీలును కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కొంతమంది అధికారులు చేతివాటాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వం మారగానే స్థానికంగా భారీగా ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇప్పటికే కొండ్లపూడి, మనుబోలు గోదాముల్లో పెద్దఎత్తున ఇసుక, స్టీలు సరఫరాలో అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఇందుకు బాధ్యులైన ఇద్దరు ఏఈలు, ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గోదాముల్లో స్టీలు, సిమెంటు, ఇసుక నిల్వలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ముమ్మరంగా విచారణ జరుగుతోంది. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో హౌసింగ్‌కు సంబంధించి 44 గోదాములు ఉన్నాయి. వీటి ద్వారా గృహనిర్మాణాలకు మెటీరియల్ సరఫరా జరుగుతూ వచ్చింది.

● విచారణ వేగవంతం

జిల్లాలోని 36 మండలాలతోపాటు నెల్లూరు నగరం, ఇతర మున్సిపాలిటీల పరిధిలోని గోదాముల్లో స్టాకుని, జరిగిన మెటీరియల్ సరఫరాపై అధికారులు విచారణ చేపట్టారు. ప్రతి గోదాములో ఇసుక, సిమెంటు, స్టీలు ఎంత నిల్వ ఉంచారు. ఇళ్ల నిర్మాణాలకు సరఫరా జరిగింది ఎంత?.. నిల్వ ఎంత? ఏమేరకు అవినీతి జరిగిందన్న కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే కొండ్లపూడిలో 560 మెట్రిక్ టన్నులు, మనుబోలులో 14 మెట్రిక్ టన్నులు, ఆత్మకూరులో 550 మెట్రిక్ టన్నుల ఇసుక అన్యాక్రాంతం అయినట్లు గుర్తించారు. దీంతో అక్కడి అధికారులపై సస్పెన్షన్‌తోపాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న విచార ణలో పొదలకూరు, కావలి మరికొన్ని గోదాముల్లో ఉన్న స్టాకుల్లో భారీగా తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఈ నెలా ఖరులోగా విచారణ పూర్తి చేసి, నివేదికలు కలెక్టర్‌కు ఇవ్వనున్నారు.

అవినీతి అధికారుల్లో గుబులు

ఈ విచారణతో అవినీతి అధికారుల్లో గుబులు రేగింది. జిల్లాలోని హౌసింగ్ శాఖలో దాదాపు 15, 20 ఏళ్లుగా పాతుకుపోయిన కొంతమంది అధికారులు ఏ ప్రభుత్వం వచ్చినా అవినీతికి పాల్పడుతూ ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్నారు. అదే ధైర్యంతో గత వైసీపీ ప్రభుత్వంలోనూ విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించక పోవటంతో చర్యలు ప్రారంభమయ్యాయి. నెలాఖరులో వచ్చే నివేదికలతో ఎన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చి, ఎంతమందిపై వేటు పడనున్నదో వేచి చూడాలి.



మనుబోలు : జగనన్న లేఅవుట్‌లో విచారిస్తున్న హౌసింగ్ అధికారులు

పేద మహిళల కోసం కుట్టుమిషన్లు

అనంతసాగరం మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పేద మహిళల కోసం ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ల పథకాన్ని అమల్లోకి తెచ్చినట్లు టీడీపీ మండల సీనియర్ నాయకుడు, సోమశిల ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు, మిషన్లు అందచేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8509
వెండి కిలో ధర	రూ. 104,000
వెండి ఒక గ్రాము	రూ.107.00

ఆగిన కండలేరు కాలువ పనులు

● మళ్లీ ప్రారంభం ఎప్పుడో...? ● ప్రభుత్వంపైనే ఆశలు

కలువాయి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రూ.1000కోట్లతో సోమశిల-కండలేరు కాలువ విస్తరణ ప నులంటూ గొప్పలు చెప్పారు. సోమశిలకు వరద వస్తే నెల రోజుల్లోనే కండలేరును నింపుతామని ప్రగ్భలాలు పలికారు. చివరకు చేసిన పనులకు బిల్లులు కూడా ఇవ్వలేక చేతు లెత్తేశారు. ఈ పనులు ఆగిపోయి దాదాపు మూడేళ్ల అ యింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తుం దోనని ఆసక్తిగా మారింది. జగన్ ప్రభుత్వం వచ్చాక రూ.928.5 కోట్లతో సోమశిల కండలేరు వరద ప్రవాహపు కాలువ(ఎస్‌కేఎఫ్ఎఫ్) విస్తరణ పనులకు పరిపాలనా ఆ మోదం ఇచ్చింది. టెండర్లు నిర్వహించి రూ.776.2కోట్ల అగ్రి మెంట్‌తో వీపీఆర్, జీడీఆర్, ఎంఆర్‌జీఆర్ సంస్థలకు పను లు అప్పగించారు. 2021 జూన్‌లో ప్రారంభమైన పనులు తొలుత వేగంగా జరిగినా, ఆ తరువాత బిల్లులు మంజూరు కాక నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు క్లియర్ చేసింది. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. 25శాతం మాత్రమే జరిగిన ఈ పనులు మళ్లీ మొదలుపెట్టే అవకాశం ఉందా.. లేదా...?అన్నది విషయం చర్చనీయాంశంగా మారింది.

● పనులు పూర్తయితే...

సోమశిల-కండలేరు కాలువ సామర్థ్యం ప్రస్తుతం 12వేల క్యూసెక్కులు. సోమశిలకు వరద వస్తే కండలేరు జలాశయం నింపాలంటే కనీసం మూడు నెలలు పడుతుంది. సాధారణంగా సోమశిలకు ప్రతి ఏటా నెల మాత్రమే వరద వస్తుంది. ఈ కాలువను విస్తరించి సామ ర్థ్యం రెట్టింపు చేస్తే నెల రోజుల్లోనే కండలేరుకు నీరు తర లించే అవకాశం ఉంది.



కలువాయి సమీపంలో అర్థంతరంగా ఆగిన కాలువ విస్తరణ పనులు

న్యూస్ బాక్స్

26న ఉదయగిరి మండల సమావేశం

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న స్త్రీ శక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పాజీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డీఎం ఎం.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు సర్వీసుల సమస్యలపై, లాజిస్టిక్స్ సేవలపై 99592 25095 నెంబర్‌కు ఫోన్ సూచనలు ఇవ్వాలని తెలిపారు.

జగనన్న కాలనీలు పూర్తి చేయాలి

వింజమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కావలి, ఉదయగిరి రోడ్లలో ఉన్న జగనన్న కాలనీలను మంగళవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నాయకులు పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్‌రెడ్డి, బయన్న మల్లికార్జున్, రమణారెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి సరస్వతీ విగ్రహం



మంత్రి ఆనం అందచేసిన సరస్వతీ విగ్రహం

ఆత్మకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్‌లో ఉన్న ఏపీఆర్ గురుకుల పాఠశాలకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం సరస్వతీ విగ్రహాన్ని అందచేశారు. గతంలో మంత్రి ఆనం గురుకులాన్ని సందర్శించినప్పుడు సరస్వతీ విగ్రహం కావాలని పాఠశాల అధ్యాపకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థినులు కోరారు. వారి కోరిక మేరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నుంచి సరస్వతీ విగ్రహాన్ని తెప్పించి పాఠశాలకు అందచేశారు.

జనసేవ పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం

వింజమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభ విజయవంతం అయిందని జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి మూడువేలమంది జన సైనికులు, వీరమహిళలు సభలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము, వెంకీ, రమేష్, రాఘవేంద్ర, మధు, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో జనసేన నేతలు

నాణ్యమైన బోధన అందించాలి



విద్యార్థులకు ఎలా బోధన చేయాలో వివరిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధ్యాయులు సులభంగా విద్యాబోధన చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని ఆర్లపడియ దళితవాడ, కొట్టాలపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థుల్లో ఉల్లాసం రేకెత్తిచ్చేలా బోధన ఉండాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. తులసీకుమారి, స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలు చేయండి



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మొండి బకాయిలుగా ఉన్న స్త్రీనిధి రుణాలను ఈనెలాఖరు నాటికి నూరు శాతం వసూలు చేయాలని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కామాక్షయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సీసీలు, వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు జిల్లాలో రూ.4 కోట్ల మేర వసూలు కావాల్సి ఉందన్నారు. ఉదయగిరి మండలం రూ.7 లక్షల బకాయి ఉందన్నారు. వీటిని ఈనెలాఖరులోపు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాజారంతుల్లా, మేనేజర్లు నరసింహరావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

స్వీయరక్షణపై విద్యార్థినులకు అవగాహన



స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి

నంగం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వీయ రక్షణపై సీఐ వేమారెడ్డి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు ఎవరిపైనా ఆధార పడకుండా ఆపద సమయంలో తనను తమను తాము రక్షించుకునేందుకు స్వీయ రక్షణకు కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి వాటిపై శిక్షణ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదరణ పథకంపై అవగాహన





ఆత్మకూరు : కులవృత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, సంగంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో షాలెట్

ఆత్మకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ఆదరణ-3 పథకంపై బీసీ వర్గాలకు చెందిన కులవృత్తుల వారికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కులాలకు చెందిన సాంప్రదాయ వృత్తులు నిర్వహిస్తున్న కుటుంబాల కు అవసరమైన పరికరాలను అందించడానికి ఆదరణ -3 పథకం చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదరణ పథకంపై మంగళవారం కుల వృత్తుల వారికి ఎంపీడీవో షాలెట్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం అన్ని కులాల వారికి ఆదరణ పథకంలో ఆధునిక పనిముట్లు, ఉపకరణాలు అందచేసి, శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా నాయీబ్రాహ్మణ, వండ్రంగి, కుమ్మరి, చేనేత, చర్మకారులకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈవోఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం : విఠపు



వెలుగొండ సాధన సమితి నాయకులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతోనే ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చునని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం కనియంపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో తాగు, సాగునీటి సమస్య ఏళ్ల తరబడి ప్రజలను వెంటాడుతూనే ఉందన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు బతుకుదెరువు కోసం వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గండిపాళెం రిజర్వాయర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీటి వసతి కల్పించడంతోపాటు వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి, సీతారామసాగర్‌లను పూర్తి చేయాలనే డిమాండ్‌తో 23న ఉదయగిరిలో జిల్లా సదస్సు నిర్వహిస్తామన్నారు. అనంతరం వెలుగొండ సాధన సమితి నాయకులతో చర్చించి నివేదికలు అందుకు న్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌ప్రసాద్, బసిరెడ్డి మాలకొండయ్య, మట్టే హరినారాయణ, గువ్వల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలు భావితరాలకు ఊపిరి



మాట్లాడుతున్న మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటరాయుడు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలు భావితరాలకు ఊపిరి వంటివని మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నం వెంక టరాయుడు అన్నారు. మంగళవా రం కనియంపాడులో నిర్వహిం చిన ఫౌండేషన్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విలువైన గ్రంథాలను డిజిటలీకరణ చేయా లనే సంకల్పంతో ఇంతవరకు 1.40 కోట్ల పేజీలను చేశామన్నారు. వచ్చే జనవరి నాటికి 3 కోట్లు చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. ఇందుకు నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సుబ్బారావు, శేషతల్పశాయి, శ్రీనివాసులు, మన్నం చంద్రమౌళి, సాంకేతిక నిపుణుడు రహమానుద్దాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురంలో పెరుగుతున్న ఎండలు

● రోడ్లపై కనిపించని జనసంచారం ● రాత్రిళ్లు చలి, పగటిపూట భగభగలు

సీతారామపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు.రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రెండు రోజులుగా మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్‌కు పై గా నమోదవుతున్నాయి.ఇప్పుడే ఎండలు దంచి కొడుతుండటంతో ముందు మరెంత తీవ్రంగా ఉంటాయని ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది, మండలంలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో కొంతమేర మార్పు కనిపిస్తోంది. అర్ధరాత్రి నుంచి చలి తీవ్రత,పగటి వేళల్లో ఎండ వేడిమితో విభిన్న వాతావరణం నమోదవుతోంది.

● తగ్గిన జనసంచారం

ఎండల కారణంగా మధ్యాహ్న సమయంలో రోడ్ల పై జన సంచారం తగ్గుతోంది. అత్యవసరమైతే తప్ప బయటకు వచ్చేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండల తీవ్రత తగ్గడం లేదు. మరి కొన్ని రోజుల వరకు కూడా ఎండ తీవ్రత ఇలాగే కొనసాగుతాయని వాతావరణ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● మార్కెట్‌లోకి పుచ్చకాయలు

ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండటంతో చల్లదనాన్ని అందించే పుచ్చకాయలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.వేసవి తాపాన్ని తీర్చడంలో ఇవి ఎంతో దోహదపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేసిన పుచ్చకాయలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పలు వాహనాల్లో మార్కెట్‌కి వస్తున్నాయి.దీంతో పాటు ప్రజలకు సేదతీర్చే సన్నారి షరబత్,మజ్జిగ, లస్సీ,ఫ్రూట్ జ్యూస్ పాయింట్లకు క్రమంగా గిరాకీ పెరుగుతున్నది. ఉక్కపోతలు ఆరంభం కావడంతో ప్రజలు కూలర్లు తదితర వాటిని అప్పుడే సిద్ధం చేసుకునేందుకు ఉపక్రమిస్తున్నారు.



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా సీతారామపురం బస్టాండ్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయి పేట బీసీకాలనీ సమీపంలో మంగళవారం ఆటోలో నుంచి జారిపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు, తి రుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన వేమూరి కొండయ్య పని ని మిత్తం ఉదయగిరికి వచ్చాడు. అనంతరం ఆటోలో వెనుక వైపు కూ ర్చొని స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమి త్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికి త్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు. అ క్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి తలకు తీవ్ర గాయం కావ డంతో కోమాలోకి వెళ్లాడని, బతకడం కష్టమని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని వెంటిలేటర్‌పై స్వగ్రామానికి తరలించా రు. ఈ మేరకు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేర ుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సోమశిలలో 55.080 టీఎంసీల నిల్వ

అనంతసాగరం మార్చి18 (ఆంధ్రజ్యోతి): సోమ శిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎం సీలు కాగా, మంగళవారం నాటికి 55.080 టీఎం సీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలు వకు 400, దక్షి ణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కండలేరులో 50.108 టీఎంసీల నిల్వ

రాపూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ లేరు జలాశయం పూర్తిసామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 50.108 టీఎంసీల నీరు ఉందని డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో 795 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 605 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 110 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 80 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఆయన వివరించారు.

C.R.I.M.E N.E.W.S

స్నేహితులే హంతకులు

● చింటు హత్య కేసులో ఆరుగురి అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి): ఆపదలో అండగా నిలవాల్సిన స్నేహితులే కిరాతకులుగా మారారు. మాట్లాడుకుందాం రా... అంటూ పిలిచి కత్తులతో నరికి హత్యచేశారు. నెల్లూరులోని ఇందిరాగాంధీ నగర్‌లో ఈనెల 14న రాత్రి జరిగిన రౌడీషీటర్ చింటు హత్య కేసులో పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను వేదాయపాళెం స్టేషన్‌లో నగర డీఎస్పీ పీ సింధుప్రియ స్థానిక ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులురెడ్డితో కలిసి విలేకర్లకు తెలిపారు. పాతవేదాయపాళేనికి చెందిన రౌడీషీటర్ అరవభూమి సుజన్ కృష్ణారెడ్డి అలియాస్ చింటు(28)పై పలు కేసులున్నాయి. అతనికి ఇందిరాగాంధీనగర్‌కు చెందిన కృష్ణసాయి అలియాస్ కిట్టు స్నేహితుడు. వీరి మధ్య పాత గొడవలున్నాయి. అది మనసులో పెట్టుకుని స్నేహితులైన కరిముల్లా, షేక్ మహ్మద్‌బాబా, జీ పవన్, ఫ్రాన్సిస్ అనిక్‌రాజ్ అలియాస్ అనిక్‌రాజ్, కే సాయితేజతో కలిసి చింటును హత్య చేయాలని నిర్ణయించాడు. సరైన సమయం కోసం ఎదురుచూస్తుండగా చింటు ఇందిరాగాంధీ నగర్‌లో ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, ఆమెను కొందరు ఇబ్బంది పెడుతున్నారని తెలుసుకున్నాడు. ఈ విషయమై ఈనెల 14న రాత్రి చింటుకు ఫోన్ చేసి మాట్లాడుకుందాం ఇందిరాగాంధీనగర్ రెండవ వీధికి రావాలని పిలిచాడు. చింటు అక్కడికి రాగానే స్నేహితులతో కలిసి కత్తులతో నరికి పరారయ్యారు. చింటు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. మంగళవారం వెంగళరావునగర్‌లో ఆరుగురిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

టిప్పరు బోల్తా : డ్రైవరు,క్లీనర్‌కు గాయాలు



సిద్ధవరం మలుపు వద్ద బోల్తా పడిన టిప్పరు

రాపూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మండలం సిద్ధవరం గ్రామ సమీపాన ఉన్న మలుపు వద్ద మంగళవారం వేకువన టిప్పరు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. తిరుపతి నుంచి నెల్లూరుకు వెళ్తున్న టిప్పరు డ్రైవరు పొగమంచులో మలుపును గమనించక రోడ్డు డివైడరును దాటి బోల్తా కొట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలం చేరుకుని విచారించారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు



పోలీసులకు పట్టుబడిన పేకాట రాయుళ్లు

రాపూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సైదాదుపల్లి గ్రామ సమీ పంలోని అటవీ ప్రాం తంలో మంగళవా రం సాయంత్రం ఎస్ఐ వెంకట రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు కోడిపందేలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది నిర్వాహకులతో పాటు రూ. 6,800 నగదు 13 బైక్‌లు, 11 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



శివ మృతదేహం

బిట్రగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గిరిజన కాలనీకి చెందిన మల్లవరపు శివ (45) సోమవారం రాత్రి అదే కాలనీకి చెందిన ఈగ జీవరత్నంతో కలిసి మోటారు బైకుపై బోగోలుకు వచ్చి తిరిగి వెళుతుండగా బోగోలు మండలం తాళ్లూరు పంచాయతీ చైతన్యనగర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ శివ మృతి చెందాడు. జీవరత్నంను చెన్నైకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కలువాయి, మార్చి 18 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను మంగళవారం రాత్రి తోపుగుంట సమీపంలో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సుమారు 10 బస్తాల (500కేజీలు) బియ్యం ఆటోలో తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. చేజర్ల మండలం నాగులవెల్లటూరుకు చెందిన ఓ వ్యక్తి ఈ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. మండలం నుంచి ప్రతి నెలా రేషన్ బియ్యం పెద్ద ఎత్తున అక్ర మంగా తరలిస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరుగుతుంది. ఆ సమయంలో ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు కొనుగోలు చేసిన బియ్యం స్థానికంగా పలు చోట్ల దాచి ఉంచుతారు. 17 తరువాత నుంచి ఈ బియ్యం మండలం దాటిస్తుంటున్నారు. ఇలా దాచి ఉంచిన అక్రమ బియ్యం తరలిస్తుండగా పోలీసులకు చిక్కింది. పౌరసరఫరాలశాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలుతోంది. పట్టుబడిన బియ్యంపై అధికారులు విచారణ జరిపితే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీ సీ కాలనీ సమీపంలో సోమవారం రాత్రి 167-బీజీ జాతీయ రహదా రిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని సీతారామపురం మండలం నం జీవరెడ్డినగర్ గ్రామానికి చెందిన ఐదు గేదెలు, మూడు దూడలు మృతి చెందాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ హరిరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మంగళవారం తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 510



మన్నేటికోట వద్ద మన్నేరుపై నిర్మాణ దశలో అర్ధంతరంగా ఆగిపోయిన చెక్‌డ్యాం ఆనకట్ట

- దశాబ్ద కాలంగా ఆగిన పనులు
- సముద్రం పాలవుతున్న వరద నీరు
- నెరవేరని రైతుల కల
- తాగు, సాగునీటికి ఇబ్బందులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

పుష్కర కాలంగా ముందుకు సాగని..

మన్నేరు చెక్‌డ్యాం!

ఉలవపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం క్రితం అర్ధాంతరంగా ఆగిన మన్నేరు చెక్ డ్యాం నిర్మాణం పనులు తిరిగి ప్రారంభం అయ్యేనా అని ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గుడ్లూరు మండలంలోని మూడు గ్రామాల మీదగా ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలోకి మన్నేరు వాగు ప్రవేశిస్తోంది. ఇక్కడ నుంచి సుమారు 20 కిలో మీటర్ల మేరకు ఎలాంటి చెక్ డ్యాంలు లేకపోవడంతో వరద నీరంతా సముద్రంపాలవుతోంది. అదే చెక్ డ్యాం నిర్మిస్తే నీటి నిల్వతో వేసవి కాలంలో కూడా భూగర్భ జలాల మట్టం స్థిరంగా ఉంటుంది. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటి అవసరాల తోపాటు ఉద్యాన పంటలైన మామిడి, సపోట, జామ, పండ్ల తోటల సాగుకు సంవృద్ధిగా నీరు అందుబాటులో ఉంటుంది. దీన్ని దృష్టిలో పెటుకొని మన్నేరు వరద నీరు పరివాహక గ్రామాలకు ఉపయోగపడేలా ఒక చెక్ డ్యాం నిర్మాణం చేపట్టాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుతంలో బద్దిపూడి, మాచవరం వద్ద మన్నేరుపై చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి మున్సిపల్ శాఖా మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలవడం పనులు చేపట్టారు. మన్నేరుకు అడ్డంగా సుమారు అర కిలోమీటరు బెడ్ వేసి మూడవ వంతు ఆనకట్ట నిర్మాణం పనులు చేపట్టారు. ఈలోపు రాష్ట్ర విభజన జరిగింది. విభజన రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక చెక్ డ్యాం పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టరు మెటీరియల్ వ్యయం పెరగడంతో నష్టాలొచ్చాయంటూ పనులు అర్ధాంతరంగా నిలిపేశాడు. పనులు చేపట్టిన బిల్లుల కోసం ఒక దశలో కాంట్రాక్టర్ కోర్టును కూడా ఆశ్రయించాడు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా మన్నేరుపై ఆగిపోయిన చెక్ డ్యాం పనుల జోలికి మాత్రం ఎవరూ వెళ్లలేదు. వాస్తవానికి లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టును మన్నేరుపై నిర్మించారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువ భాగంలో కురిసే వర్షాలకు వచ్చే వరద నీరుతో రాళ్లపాడు సామర్థ్యం ఎక్కువైతే దిగువ మన్నేరుకు వదులుతారు. మన్నేటికోట గ్రామం దాటితే మన్నేరు వరద నీరు నేరుగా సముద్రంలోకి చేరుతోంది. దీంతో ఈ నీటిని ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా చేయాలన్న సంకల్పంతో చేపట్టిన చెక్ డ్యాం నిర్మాణం దశాబ్ద కాలంగా అసంపూర్తిగా మిగిలిపోవడంతో మన్నేరుకు వరద వచ్చినప్పుడల్లా నీటి ప్రవాహం తాకిడికి చెక్ డ్యాం కాంక్రీట్ ఆనకట్ట, సపోర్టు బెడ్ పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు అర్ధాంతరంగా ఆగిపోయిన చెక్‌డ్యాం పనులను ఉనం ప్రారంభించి పూర్తి చేయాలని మన్నేరు పరివాహక గ్రామాలైన మన్నేటికోట, ఆత్మకూరు, భీమవరం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెక్‌డ్యాం నిర్మిస్తే రైతులకు ప్రయోజనం



మన్నేరు పరిసర గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటకుండా, ఉద్యాన పంటలకు, తాగునీటికి మేలు జరిగేలా చెక్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టారు. పదేళ్ల క్రితం అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను గత ప్రభుత్వంలో అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయాన్ని గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళతాం.

- పులివర్తి బసవయ్యనాయుడు, మన్నేటికోట సర్పంచు

న్యూస్ బాక్స్

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వలేటివారిపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 22వ తేది లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో సాధించిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తరువాత అన్ని ధ్రువీకరణ పత్రాలు పాఠశాలలో అందజేయాలని తెలిపారు.

ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయాలి

బిట్రగుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట, బోగోలు పంచాయతీలోని ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ కోరారు. మంళవారం కమిటీ సభ్యులతో కలసి ఆయన మాట్లాడుతూ బోగోలు-ఇబ్రహీంపేట మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బోగోలు-ఆర్సీఎం చర్చి మధ్య ఉన్న రోడ్డు కూడా అధ్వానంగా ఉందని, బోగోలు బజారులో దుకాణాల వద్ద ఎత్తుగా మట్టిపోరియడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల రవిచంద్ర, దాసరి సునీల్, ఆరోగ్యరాజ్, అహ్మద్, శ్రీధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ విజయవంతంపై హర్షం

కొండాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం కావడం పట్ల ఆపార్టీ మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్ర హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ సభకు మండలం నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు తిప్పినేని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామంలో వెలసి ఉన్న పోలేరమ్మకు మంగళవారం గ్రామ పొంగళ్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. కోవూరుపల్లి, కడనూతల గ్రామ ప్రజలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. సామూహిక పూజలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయత్రం భజన కార్యక్రమాలు జరిగాయి.



రోడ్లను కమ్మేస్తున్న పొగమంచు

లింగసముద్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగైదు రోజుల నుంచి విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. వేకువజామున పొగమంచు, పగలు మండే ఎండలు, రాత్రివేళ కొద్దిగా చలి ఉంటుంది. ముఖ్యంగా మంగళవారం వేకువజామున 4 గంటల నుంచే పొగమంచు దట్టంగా అలుముకుంది. ఇది ఉదయం 8 గంటల వరకు ఉండడంతో వాహనదారులు లైట్లు వైసుకొని వెళ్లాల్సి వచ్చింది. ఎదురెదురుగా వస్తున్న వాహనదారులు మంచుదుప్పటిలో జాగ్రత్తగా వెళ్లాల్సి వచ్చింది. అయితే వాకింగ్ చేసే పాదాచారులు మంచులో నడిచేందుకు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దినేష్

వలేటివారిపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మోటారుబైకుపై వేగంగా వెళ్తూ కారును ఓవర్ టేక్ చేసి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని పోకూరు-బడేవారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శింగమనేనిపల్లె గ్రామానికి చెందిన బాశం దినేష్ (24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తమ గ్రామం శింగమనేని పల్లె నుంచి పోకూరు మీదుగా కందుకూరుకు మోటారుబైకుపై వెళ్తుండగా మార్గమధ్యంలో పోకూరు-బడేవారిపాలెం గ్రామాల మధ్య ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. దినేష్ మృతితో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు.

రేణుమాల చెరువు, ఉప్పుటేరులో కలప వేలం



కలప నరికి విక్రయించేందుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రేణుమాల చెరువులో ఉన్న కలపను కొట్టి విక్రయించుకునేందుకు పంచాయతీ కార్యాలయం వద్ద ఇరిగేషన్ శాఖ ఏఈ రమేష్ కుమార్ మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.2.50 లక్షలకు చీమల రాధయ్య అనుమతులు దక్కించుకున్నారు. అలాగే ఉప్పుటేరులో కొండాపురం వద్ద నుంచి భీమవరప్పాడు గ్రామం వరకు ఉన్న కలపకు వేలం నిర్వహించగా రూ.6.50 లక్షలకు మురారిశెట్టి సుబ్బారావు దక్కించుకున్నారు. వేలంలో దక్కించుకున్న వ్యక్తులు ఏడాది పాటు కలపను నరికి విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, తాటికొండ ప్రవీణ్, మామిళ్లపల్లి వెంకటరమణయ్య, కొమ్మి ప్రభాకర్, చాగంటి క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా



కందుకూరులో ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ల రీడర్లు

కందుకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డి మాండ్లు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ మీటర్ల రీడర్స్ మంగళవారం కందుకూరులో ధర్నా చేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించకుండా తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ మీటర్ల రీడర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో సంఘం కార్యదర్శి కుంచాల సిద్ధయ్య మాట్లాడుతూ 15 ఏళ్లుగా తాము విద్యుత్‌శాఖ లో పనిచేస్తున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల నెలనెలా రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండబోదని, ఇప్పటికే కేటగిరి 2 వినియోగదారులందరికీ స్మార్ట్‌మీటర్లు బిగించారని ఈ కార్యక్రమం పూర్తయితే మమ్మల్ని పొమ్మనలేక పొగబెట్టినట్లేనని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖలో తమను పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకుని ప్రత్యామ్నాయంగా తమ సేవలను వినియోగించుకోవాలని, ఎస్కో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 20న అన్ని ఎస్‌ఈ కార్యాలయాల వద్ద, 24న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించి 27న విద్యుత్‌శాఖ సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించ కపోతే ఏప్రిల్ 1 నుంచి సమ్మెబాట పడతామని, 4న చలో విజయవాడ కార్యక్రమంతో నిరవధిక ఆందోళనకు సిద్ధపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత వై.ఆనంద్‌మోహన్, విద్యుత్ మీటర్ల రీడర్స్ ఈ.మాల్యాద్రి, డి.శ్రీను, జే.రాము, డి.శివ, మల్లికార్జున, వంశీ కృష్ణ, మధుకుమార్, నరేష్, సురేష్, చరణ్ పాల్గొన్నారు.

ప్రజలపై పన్నులు, విద్యుత్ బిల్లుల భారం

కావలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని, ఒకేసారి వేలల్లో విద్యుత్ బిల్లులు, ఇంటి, నీటి పన్నులు ఎలా కడతారని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య తెలిపారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నేతలు మంగళవారం 26వ సచివాలయ పరిధిలో పర్యటించి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 26వ సచివాలయ అడ్మిన్‌ను కలిసి ఆ ప్రాంత సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.మధుసూదన్‌రావు, కృష్ణయ్య, కృష్ణమోహన్, బంగారయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

స్కౌట్స్, గైడ్స్ యూనిట్ల ప్రారంభం



స్కౌట్స్, గైడ్స్ బాలబాలికల యూనిట్

ఉలవపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ యోజన) పథకంలో భాగంగా కరేడు జడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లును ప్రాంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్నూరు శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా పాఠశాల విద్యావ్యవస్థలో క్రమశిక్షణ, దేశభక్తి, స్వీయ రక్షణ, సేవాగుణం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పథకం ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా 16 మంది బాలురుతో స్కౌట్ యూనిట్, 16 మంది బాలికలతో గైడ్స్ యూనిట్‌లను ప్రారంభించామన్నారు. స్కౌట్ యూనిట్ కెప్టన్‌గా పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు రవిచంద్ర, గైడ్స్ కెప్టన్‌గా సైన్స్ ఉపాధ్యాయిని ప్రసన్నలక్ష్మీ వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. స్కౌట్ అండ్ గైడ్ సర్టిఫికేట్ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్లో 2 శాతం, విద్యా అవకాశాల్లో 0.5 శాతం రిజర్వేషన్లు సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోటంగారి బాలేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


అల్లూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్తుమోపూరులో మస్జిద్-ఎ-బిలాల్ మసీదులో రంజాన్ ఉపవాసాలు ఉంటున్న ముస్లింలకు మంగళవారం విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి అనుచరుడు పఠాన్ అబ్దుల్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



నార్తుమోపూరు మసీదులో ఇఫ్తార్ విందులో ముస్లింలు

వాటర్ ట్యాంకుల శుభ్రత పట్టదా ?

వలేటివారిపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దాహం తీర్చడానికి నిర్మించిన వాటర్ ట్యాంకుల శభ్రతను అధికారులు గాలికొదిలేశారు. ట్యాంకుల నిర్వాహణ, క్లోరినేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. పల్లెలో ప్రజలు రక్షిత నీరు అందక రోగాల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని కిందిస్థాయి పంచాయతీ సిబ్బందిని ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రక్షిత నీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. మండలంలో 36 గ్రామాల్లో 39 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేసి క్లోరినేషన్ చేసిన తేదీని వాటర్ ట్యాంక్‌పై నమోదు చేయాలి. వాటర్‌ట్యాకులు క్లోరినేషన్‌కు పంచాయతీలోని 15వ ఆర్థికసంఘం నిధులు వినియోగించుకోవచ్చు. అయితే ఎక్కడా వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేస్తున్న దాఖలాలు లేవు. కొన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేస్తునట్లు చూపి నిధులు డ్రా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు పాచిపట్టి కనిపిస్తోన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకులు శుభ్రత చేసి సురక్షిత నీరందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అంకభూపాలపురంలో క్లోరినేషన్‌కు నోచుకోని వాటర్‌ట్యాంక్

ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి : సీపీఎం

బిట్రగుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజా, రైతు సమస్యలపై ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద సీపీఎం చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ.మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బోగోలు మండలంలోని బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వరి ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, అర్హులైన పేదలకు నివాస స్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. బిట్రగుంటలో రైల్వే యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, అసంపూర్ణంగా ఆగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

ఇలాగైతే రోగాలు రావా?



ఆముదాలదిన్నె ఎస్టీ కాలనీలో చేతిపంపు, కుళాయిల వద్ద నిల్వ చేరిన మురుగు

కావలి మండలం ఆముదాలదిన్నెలో తాగు నీటి కుళాయిలు, రహదారి పక్కన మురుగు నిల్వ చేరి అపరిశుభ్రతతోపాటు దుర్వాసన కొడుతోంది. ఇలా ఉంటే రోగాలు రావా అని స్థానికులు వాపోతున్నారు. ఈ గ్రామానికి తుమ్మలపెంట రక్షిత మంచి నీటి పథకం నుంచి తాగునీరు సరఫరా జరుగుతుండగా ఆ కుళాయిలతో పాటు గ్రామంలోని చేతి పంపుల వద్ద, రోడ్లపై మురుగు నిల్వ చేరుతుండడంతో నీరు కలుషితమవుతోందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గ్రామంతో పాటు ఎస్టీ కాలనీలో తాగునీటి కుళాయిల వద్ద మురుగునీరు నిల్వ చేరకుండా, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలిరూరల్ (ఆంధ్రజ్యోతి)



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పట్టలు... రైతుల నేస్తం!

ఉండడానికి నీడనిస్తూ.. వరి కుప్పల నూర్పిడికి, ధాన్యం ఆరబోసుకోవడానికి, ధాన్యం తడవకుండా రక్షణకు ఎంతో ఉపయోగ పడుతున్న పట్టలు రైతులకు నేస్తంగా మారాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు కోతల సమయంలో ఎంతో అత్యవసరమైనవి పట్టలు. గతంలో కుప్పలు నూర్పిడి చేసే టప్పుడు కల్లాల్లోని కొయ్‌కాలు (వరికోత కోయగా మిగిలిన దుబ్బు) కోసి మండ తోలి కల్లాన్ని పరిశుభ్రంగా మార్చి తద్వారా కుప్పలు నూర్పిడి చేసి ఆ ధాన్యాన్ని ఎంతో కష్టంగా చిమ్ముకొని గుట్టలు చేసుకునే పరిస్థితి. దాని తరువాత పట్టల ఆధారంగా ఇవన్నీ చేయ కుండానే కుప్పలను నూర్పిడి చేసేవారు. రానురాను వరికోత యంత్రాల ద్వారా కోతలు ప్రారంభమైనప్పటి నుంచి కేవలం ధాన్యాన్ని రాశులుగా పోసుకునేందుకు, ఆరబోసుకునేందుకు మాత్రమే ఇవి దోహదపడుతున్నాయి. అయితే దాదాపు 25 ఏళ్లగా ఇవి రైతు నేస్తాలుగా మారిపోయాయి. వరికోతలు ప్రారంభమయ్యే నాటికి ఉత్తరాది జిల్లాల నుంచి ఈ ప్రాంతాలకు ఎన్నో కుటుంబాలు వచ్చి ఈ పట్టలను అద్దెకు ఇచ్చి ఒక్కొక్క పట్టకు రోజుకు రూ.10 నుంచి రూ.15 అద్దె తీసుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇటు రైతులకు అటు పేద కుటుంబాలకు ఆదరువుగా ఉంటున్నాయి.

- అల్లూరు(ఆంధ్రజ్యోతి)



ధాన్యం ఆరబోసిన పట్టలనే రక్షణగా ధాన్యంపై కప్పిన రైతులు



వైభవంగా శ్రీవారి గరుడసేవ



శ్రీవారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా పెంచలకోనలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి పంచామృత అభిషేకం, అనంతరం చందనంతో అలంకరించారు. తదుపరి 9 గంటలకు శ్రీవార్లకు మూలమంత్ర నృసింహయాగం, 11 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం బంగారు గరుడసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించామని ఆలయ డిప్యూటీ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

ఇంటర్‌లో తెలుగును ఆప్షనల్ చేయొద్దు

● మూల్యాంకన కేంద్రం ఎదుట అధ్యాపకుల నిరసన

నెల్లూరు(విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్య సంస్కరణలో భాగంగా తెలుగు భాషను ఆప్షనల్ చేయడం తగదని, ద్వితీయ భాషగా తెలుగును తప్పనిసరి చేయాలని తెలుగు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మూల్యాంకనం కేంద్రం ఎదుట మంగళ వారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఇంటర్ కోర్సు ప్రారంభం నుంచి ద్వితీయ భాషగా ఉన్న తెలుగును ఆప్షనల్ చేయడం తెలుగుభాషను అవమానించడమేనన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అనంతరం ఆర్ఐవో, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు రమేష్, వెంకట్రావు, పులి చెంచయ్య, ఎం శ్రీనివాసులు, ఆశీర్వాదం, కృష్ణ, సోమశేఖర్, వనజ, సరళ పాల్గొన్నారు



స్పాట్ కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న తెలుగు అధ్యాపకులు

'ఉపాధి'లో అంతులేని అవినీతి

● రూ.37.80 లక్షల రికవరీకి ఆదేశం
● పలువురు అధికారులు, సిబ్బందిపై సస్పెన్షన్ వేటు
● రికార్డులు అప్పగించని వారిపై పోలీసు కేసు

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి చోటుచేసుకున్నట్లు అధికారులు నిగ్గు తేల్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ గంగాభవానీ అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి రూ.14 కోట్ల పనుల్లో రూ.37.80 లక్షలు అవకతవకలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు.

మండలంలోని కొన్ని పంచాయతీల్లో ఉపాధి పనుల కొలతల్లో భారీ వ్యత్యాసం ఉండడం, డబుల్ జాబ్‌కార్డులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉద్యోగులు, చనిపోయిన వారికి మస్టర్లు వేశారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో నేమ్ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా, నిధులు డ్రా చేసి బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, సిబ్బంది బెదిరింపులకు పాల్పడడం తదితర విషయాలను ప్రజావేదికలో గుర్తించామని వివరించారు.

● పంచాయతీల వారీగా ఇలా...

ఉదయగిరి పంచాయతీ రూ.2,98,788 లక్షలు, కొండాయపాళెం రూ.2,61,763, పుల్లాయ పల్లి రూ.9,28,380, అర్లపడియ రూ.4,14,074, బండగానిపల్లి రూ.1,53,811, దాసరిపల్లి రూ.17,200, శకునాలపల్లి రూ.41,147, నేలటూరు రూ.29,400, తిరుమ లాపురం రూ.2,71,774, వెంగళ రావునగర్ రూ.2,31,071, జీ.అయ్యవారి పల్లి రూ.2,42,066, జీ.చెరువుపల్లి రూ.78,011, గండిపాళెం రూ.61,427, జీ.చెర్లోపల్లి రూ.2,252, అప్పసముద్రం రూ.5,39, 668, కృష్ణంపల్లి రూ.2,07,264, గన్నేపల్లి రూ.2,500లు చొప్పున మొత్తం రూ.37,80,596 లక్షల మేర అవకతవ కలు జరిగినట్లు గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా విజి లెన్స్ అధికారిణి విజయలక్ష్మి, అంబుడ్స్ మన్ వెంకటరెడ్డి, ఏపీడీ శంకర నారా యణ, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాస రాజు, ఎస్ఆర్పీ బుజ్జి, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

అధికారులు, సిబ్బంది సస్పెన్షన్, పోలీసు కేసు

సామాజిక తనిఖీ బృందం పనుల పరిశీలనలో గుర్తించిన అంశాలను ప్రజావేదికలో అధికారుల ఎదుట చదివి వినిపించారు. దీంతో అవకతవకలకు పాల్పడిన ఏపీవో, ఇద్దరు ఇంజనీరింగ్ కన్సల్టెం ట్లు, ముగ్గురు సాంకేతిక సహాయకులు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, తొమ్మిదిమండి క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే రూ.93 లక్షల పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందానికి రికార్డుల అప్పగించలేదన్నారు. రికార్డులు అప్పగించకపోవడం పెద్దనేరమని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వేసవి కాలం వచ్చిందంటే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కూలీలు అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో కూలీలకు వేసవి అలవెన్స్ ప్రకటించేవారు. అందువల్ల వేసవి కాలం నాలుగు నెలల్లో (మార్చి, ఏప్రిల్, మే, జూన్) కూలీలకు పనుల పరిమాణాన్ని తగ్గించి సాధారణంగానే వేతనం చెల్లించేవారు. అయితే ఈసారి వేసవి అలవెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాలేదు. ఉపాధి కూలీలకు చెల్లించే రోజువారి వేతనం రూ.300లకు పెంచడంతో వేసవి అలవెన్స్ కూడా అందులోనే ఉంటుందని చెబుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ లేనట్టే!

● గతంలో ఐదు నెలలపాటు అమలు
● నేటికీ విడుదల కాని మార్గదర్శకాలు
● పెరుగుతున్న ఎండలు ● కూలి గిట్టుబాటు అయ్యేనా!?

జిల్లాలోని 37 మండలాల్లో 2.78 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.38 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో సుమారు 3.75 లక్షల మంది ఉపాధి పనులకు వెళ్లేవారున్నారు. ప్రస్తుతం రోజుకు సరాసరి 44 వేల మంది పనులకు హాజరవుతున్నారు. వేసవిలో కూలీలు పనులు చేయడం కష్టంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు గతంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి వంద శాతం పనికి వేతనం అందించే వారు. అంటే వేసవిలో నేల గట్టిగా ఉండటంతో పని తక్కువ జరిగినా వేసవి అలవెన్సుతో కలిపి ఇస్తారు. దీంతో కూలి గిట్టుబాటు అయ్యేది.

● జోరుగా పనులు

ఉపాధి పనులు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కూలీల హాజరుశాతం కూడా బాగా పెరిగింది. గతంలో ఈ సమయంలో రోజువారీ 30-35 వేల మంది పనులకు హాజరయ్యేవారు. ఇప్పుడు 44 వేల మంది వరకు పనులు చేస్తున్నట్లు డ్వామా అధికారులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలయ్యాయి. ఇవి పూర్తయితే ఈ సంఖ్య లక్ష దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో చెరువుల పూడికతీత పనులు, కందకాలు, వ్యక్తిగత ఇంకుడు గుంటలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనుల ప్రతిపాదనలు పంపారు. మరో 20 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఉపాధి హామీకి కొత్త బడ్జెట్‌లో కోటి పని దినాలు కల్పించే అవకాశం ఉంది.

● మేట్‌లకు ప్రోత్సాహకాలు

ఉపాధి హామీ పథకంలో మేట్‌లకు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారు. ఒక్కో మేట్ 50 మంది కూలీలను పనులకు తీసుకువస్తుంటారు. అందువల్లే ప్రతి మేట్‌కు వారు తీసుకువచ్చే ప్రతి కూలీకి రూ.రూపాయిన్నర వంతున అదనపు వేతనం అందిస్తారు. ఉపాధి కూలీలను పనులకు తీసుకురావటానికి మేట్‌లకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు.

అలవెన్స్ లేనట్టే

ఉపాధి కూలీలకు ప్రతి ఏడాది అలవెన్స్‌ను జనవరిలోనే ప్రకటించి మార్గదర్శకాలు విడుదల చేసేవారు. కానీ ఇటీవల ఉపాధి కనీస కూలి రూ. 275 నుంచి 300కు తగ్గకుండా కల్పించాలని కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులోనే వేసవి అలవెన్స్ ఉంటుందని చెబుతున్నారు. అంతేగాక మార్చి నెల సగం పూర్తి కావస్తోంది. దీంతో ఈ ఏడాది ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ లేనట్టేనని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలకు వేసవిలో రూ.300 కూలి ఖచ్చితంగా గిట్టుబాటు అయ్యేనా అనే సందేహం వ్యక్తమవుతోంది.

స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు

● లింగనిర్ధారణ చేస్తే కఠిన శిక్షలు : డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), మార్చి 18 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై డెకాయ్ ఆపరేషన్లు ముమ్మరంగా చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. మంగళవారం ఆమె చాంబర్‌లో గర్భస్థ పిండ నిర్ధారణ చట్టం, సహాయక పునరుత్పత్తి సాంకేతిక చట్టం అమలుపై జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఇందుకు 8 మంది అధికారులను నియమించామని తెలిపారు. ఈ బృందం గతంలోనూ జిల్లాలో 31 డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించిందని వివరించారు. భ్రూణ హత్యలను అరికట్టడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్, కమిటీ సభ్యులు డాక్టర్ పద్మజ, కరీముల్లా, డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్, డెమో కనకరత్నం, ఎన్‌జీవోలు కవితారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోమశిల ఈఈ బదిలీ

అనంతసాగరం మార్చి18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం ఈఈ ఎం దశరథ రామిరెడ్డి మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆత్మకూరు ఇరిగేషన్ డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసకుమార్ పదోన్నతిపై నియమితులయ్యారు. త్వరలో ఆయన విధుల్లో చేరనున్నారు.

రేపటి నుంచే ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం

నెల్లూరు (విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌లో భాగంగా ఈనెల 22న ప్రారంభం కావాల్సిన ఫిజిక్స్, ఎకనామిక్స్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని 20వ తేదీ నుంచే ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు ఈ మార్పును గమనించి ఈనెల 20వతేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ కేంద్రం వద్ద రిపోర్ట్ చేయాలని కోరారు. కాగా, మంగళవారం జరిగిన ఒకేషనల్ మైనర్ సబ్జెక్ట్ పరీక్షలకు 476 మందికి గాను 416 మంది హాజరయ్యారని, 60 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

'మాగుంట' పేరుతో దరఖాస్తు చేసిందెవరు?

● సర్వేపల్లి గ్రావెల్ కేసుపై ముమ్మరంగా సిట్ విచారణ
● హాజరైన ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

నెల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు సంబంధించిన కేసు విచారణ ముమ్మరంగా సాగుతోంది. సిట్ ఇన్‌చార్జి అయిన బాపట్ల డీఎస్పీ కార్యాలయం వేదికగా జరుగుతున్న విచారణకు మంగళవారం ఇరిగేషన్ నెల్లూరు సెంట్రల్ డివిజన్ గత ఈఈ, ప్రస్తుత ఈఈతోపాటు ఆ డివిజన్‌లో పనిచేస్తున్న ఓ అటెండర్ హాజరయ్యారు. వీరిని వేర్వేరుగా విచారించారు. గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరుతో దరఖాస్తు చేసిందెవరు?, ఎంపీ పేరిట వేరొక వ్యక్తి దరఖాస్తు చేసుకుంటే ఎలా అనుమతులిచ్చారు..? అని గత ఈఈని ప్రశ్నించినట్లు తెలిసింది. దరఖాస్తు చేసుకున్నది ఒకరి పేరుతో, చలానాలు కట్టింది మరొకరి పేరుతో అయితే ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేదని అడిగినట్లు సమాచారం. పోలీసు కేసు విచారణ జరుగుతుండగానే పెనాల్టీకి సంబంధించిన డీడీలను ఎలా తీసుకుంటారని ప్రస్తుత ఈఈని ప్రశ్నించినట్లు తెలిసింది. సెంట్రల్ డివిజన్ కార్యాలయానికి ఎవరెవరు వచ్చి వెళుతుంటారు..? దరఖాస్తులు, డీడీలు ఎవరు తెచ్చిచ్చారు..? వంటి ప్రశ్నలకు అటెండర్ సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో అప్పట్లో పనిచేసిన మైనింగ్ ఉన్నతాధికారిని కూడా విచారణకు పిలిచారు. ఇరిగేషన్ అధికారులు సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసిన సంగతే ముందుగా మైనింగ్ శాఖకు తెలియనప్పుడు.. అక్కడ జరిగిన అక్రమ తవ్వకాలకు ఏ విధంగా పెనాల్టీలు విధిస్తారని మైనింగ్ అధికారిని సిట్ బృందం ప్రశ్నించినట్లు సమాచారం. ఈ అధికారులే కాకుండా తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నట్లు రికార్డుల్లో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు కూడా విచారణకు హాజరయ్యారు. అయితే గ్రావెల్ కోసం దరఖాస్తు చేసుకున్నది తాము కాదని వారు స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, తమకు గ్రావెల్ సరఫరా చేసిన వ్యక్తి ఎవరో చెప్పినట్లు తెలిసింది. కాగా, ఈ కేసులో మరికొందరిని విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో దర్యాప్తునకు రానున్నట్లు తెలిసింది.

ప్రైవేట్ కళాశాలల గుర్తింపు దరఖాస్తు తేదీ పొడిగింపు

నెల్లూరు (విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రొవిజినల్ అఫిలియేషన్ రెన్యువల్‌కు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించినట్లు ఆర్ఐవో శ్రీనివాసులు తెలిపారు. కళాశాల గుర్తింపుతోపాటు కోర్సుల మార్పిడి, కొత్త కోర్సులు, అదనపు సెక్షన్ల మంజూరు, ద్వితీయ భాష, మీడియం మార్పులకు అనుమతి, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి కళాశాల తరలింపు, కళాశాల మూసివేత, మూతబడిన కళాశాల పునః ప్రారంభం, కళాశాలల పేరు మార్పు వంటి అంశాలకు ఈనెల 31వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కళాశాలల యాజమాన్యాలు నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హులైన ప్రతి చేనేతకు గుర్తింపు కార్డు ఇవ్వాలి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి చేనేతకు గుర్తింపు కార్డు ఇవ్వాలని శాసనమండలి మాజీ సభ్యుడు బూదాటి రాధయ్య, చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధరవపు బాలాజీలు పేర్కొన్నారు. మంగళవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా నేతన్న నేస్తాన్ని కూడా త్వరలో అమలు చేసి చేనేతల బతుకుల్లో వెలుగులు నింపుతారని ఆశిస్తున్నామన్నారు. మగ్గం ఉంటేనే చేనేత గుర్తింపు కార్డు ఇస్తామని అధికారులు చెబుతున్నారని అన్నారు. 50 ఏళ్ల మగ్గాలపై వస్త్రాలు నేసిన నేతన్నలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ చేనేత వృత్తికి దూరమయ్యారని అలాంటి వారికి గుర్తింపు కార్డుతోపాటు పెన్షన్ ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డు లేకపోతే సచివాలయాల్లో కనీసం దరఖాస్తు కూడా తీసుకో వడం లేదని అన్నారు. అనారోగ్య సమస్యలతో దయనీయ పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం సుమోటోగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు అశ్వద్ధామ, నేతలు రామనాథం రాజశేఖర్, చింతలపూడి పెంచలయ్య, సోమాగోపాల్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

● సమగ్రశిక్ష ఎస్‌పీడీ రవీంద్రనాథ్ రెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా విద్యాశాఖ పనిచేస్తోందని సమగ్ర శిక్ష రాష్ట్ర అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల, రేబాల జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళ వారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఎవరైనా విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డీ వెంకట సుబ్బయ్య, ఏఎంవో జీ సుధీర్‌బాబు, పాల్ నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఈవోలు, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



కోవూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్ రెడ్డి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

నెల్లూరు పట్టణ, పరిసరాలలో 100% వాస్తు, ఆల్ ఎమినిటీస్ నుడా అప్రూవల్ ప్లాట్లు అతి తక్కువ ధరలలో లభించును. శ్రీలత : 81257 64051

AJT - 200775

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రమాణించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరిపిన లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గుర్తించగలరు. మేనేజర్ - ఏడీవీటి

భూమి కొనుగోలు పథకం వివరాలు బయటపెట్టాలి

కావలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలం ఊటుకూరులో భూమి కొనుగోలు పథకం ద్వారా కొనుగోలు చేసిన భూములలో జరుగుతోన్న భాగోతాలను అధికారులు బయట పెట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి లో మంగళవారం దళిత నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీల కోసం భూమి కొనుగోలు పథకం ద్వారా 2018లో సర్వే నెంబరు 1288, 1294లో 90.86 ఎకరాలు భూమి కొనుగోలు చేసి దానిని 86 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. ఆ భూములకు సంబంధించిన రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించినా వాటిని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించకుండా రైతులే వాటిని సాగుచేసుకోవటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు రైతులతో లాలూచి పడి వారికి సహకరిస్తూ ఎస్సీలకు వాటిని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అయితే ఎస్సీలకు భూములు ఇచ్చినట్లు లబ్ధిదారుల జాబితాలో వారి పేర్లు ఉన్నా ఇంకా భూములను అప్పజెప్పక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆ భూములను సర్వే చేసి లబ్ధిదారులకు అప్పగించ కపోతే ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. ఆ తర్వాత అవసరమైతే ఉద్యమాలు చేపట్టాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో దళిత నేతలు రెబ్బా పాపారావు, అద్దంకి కార్తీక్, విజయరత్నం, జడ్డా వాసు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

● విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, హింస, అణచివేత వంటి అమానుష చర్యలను నిరోధించేందుకు ఉద్దేశించిన చట్టాన్ని జిల్లాలో కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి జిల్లాస్థాయి విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా కమిటీ సభ్యులు మురళీకృష్ణ యాదవ్, ప్రవల్లిక, శ్రీరాములు, ప్రభాకర్, సాయిప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఏదైనా సమస్యపై కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఆయా కేసుల వివరాలు అందించడం లేదని వాపోయారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకొకసారి తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అంతకంటే ముందుగానే డివిజన్ స్థాయిలో కమిటీ సమావేశాలు జరగాలని సూచించారు. వసతి గృహాల్లోని పిల్లలతో పనులు చేయిస్తున్న వార్డెన్లు, ఇతర ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీలకు ఆధార్‌కార్డులు ఇప్పించేందుకు మండలాల వారిగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కమిటీ సభ్యుల వివరాలను అన్నీ పోలీస్‌స్టేషన్లు, తహసీల్దారు కార్యాల యాలకు పంపించాలని సూచించారు. వసతి గృహాల నిర్వహణపై సభ్యులు లేవనెత్తిన సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణికి సూచించారు. జిల్లాలో నమోదైన కేసులు, తీసుకున్న చర్యలను ఎస్పీ కృష్ణకాంత్ వివరించారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్‌కలెక్టర్ పూజ, డీఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీవోలు సన్ని వంశీకృష్ణ, అనూష, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు 67మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జ రిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షకు 67మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి మ ధుమతి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యా హ్నం జరిగిన పరీక్షలో 750మంది విద్యార్థు ల్లో 683మంది హాజరయ్యారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8509
వెండి కిలో ధర	రూ. 1,04,000
వెండి ఒక గ్రాము	రూ.107.00

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

● జీవీ.ప్రసాద్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, ఇందుకూరు పేట



ఇందుకూరుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):మద్యం షాపుల యజమానులు, బెల్టు షాపుల నిర్వాహకులను ప్రోత్సహించినా.. ఇతర రాష్ట్రాల మద్యం దిగుమతి చేసుకున్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇందుకూరు పేట ఎక్సైజ్ సీఐ జీవీ.ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

? ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు.

! ఇప్పటివరకు 585మద్యం సీసాలు సీజ్ చేసి, 44మంది పై కేసులు నమోదు చేశారు. 72 మందిని బైండోవర్ చేశాం.

? బెల్టుషాపులపై తీసుకునే చర్యలు.

! బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై మొదటిసారి పట్టుకుంటే కేసు నమోదు చేస్తాం. రెండోసారి పట్టుబడితే రూ.5లక్షల జరిమానా విధిస్తాం.


? ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరుగుతున్నాయా.

! ప్రతి మద్యంషాపు వద్ద ఎమ్మార్పీ ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అధిక రేట్లకు మద్యం విక్రయాలు జరిపితే రూ.5లక్షల జరిమానా.. అవసరం అయితే లైసెన్స్‌ను రద్దు చేస్తాం.

రాత్రంతా అంధకారం..

● ఎర్రగుంటలో వెలగని వీధిలైట్లు
● ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్న జనం

వెంకటాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):చవటపాలెం పంచాయతీలోని ఎర్రగుంట గ్రామంలో సగానికిపైగా వీధి లైట్లు వెలగడం లేదు. ఈ సమస్యతో రాత్రేయితే వీధుల్లో చీకటి కమ్ముకోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. విషపురుగుల సంచారం అధికంగా ఉండడంతో ఇళ్లల్లోంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకుని ఫిర్యాదులు ఇచ్చినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. తమ అవస్థలు ఇంకా ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని బహా టంగానే చర్చించుకుంటున్నారు. అధికారుల తీరుపై పలు వురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి గ్రామంలో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఎర్రగుంటలో వీధిలైట్లు వెలగక పోవడంతో కమ్ముకున్న చీకటి

నిమ్మ పంటకు తెగుళ్ల బెడద

● నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు
● పొదలకూరు ఉద్యనవన అధికారి ఆనంద్

పొదలకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిమ్మపంట 10,500హెక్టార్లలో సాగు జరుగుతుండగా వివిధ రకాల తెగుళ్లు ఆశించి ఉండడంతో దిగుబడిపై ప్రభావం పడి, తోటలు పాడైపోతున్నాయి. ముఖ్యంగా ఆకుముడత, పండ్ల రసాన్ని పీల్చే రెక్కల పురుగులు, బంక, వేరుకుళ్లు, గజ్జి, మొజాయిక్ తెగులు ఆశించి ఉన్నాయి. నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు గురించి పొదలకూరు ఉద్యాన అధికారి (హెచ్‌ఓ) ఈ.ఆనంద్ వివరించారు.

● **గజ్జి తెగులు...**

నిమ్మ పంటపై ఎక్కువగా ఆశించే తెగులు ఈ గజ్జి తెగులు. ఇది కాయలు, ఆకులు, చిన్న, పెద్ద కొమ్మలను ఆశిస్తుంది. తెగులు ప్రభావం అధికంగా ఉంటే చెట్లు ఎండిపోయి చనిపోతాయి.

నివారణ చర్యలు: ఈ తెగులు సోకి ఎండిన కొమ్మలను కత్తిరించి స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము, 30 గ్రాములు బెలైటాక్స్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచాకారి చేయాలి. గజ్జి ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని గోకి బెరడును తీసి వేసి బోర్డోపేస్టును పూయాలి.



● **ఆకుముడత:** ఈ తెగులు ఎక్కువగా లేత చిగుర్లపై ఆశించి ఆకులపై తెల్లటి పొరలు వంకరటింకరగా ఏర్పడి ఆకులు ముడుచు కునేలా చేస్తుంది. తద్వారా ఆకులపై గజ్జి తెగులు ఎక్కువగా వ్యాప్తి చెంది ఆకులు రాలిపోతాయి.

నివారణ చర్యలు: ఆకులుముడతలు పడినట్లు గుర్తిం చి నివారణ చర్యలు చేపట్టాలి. డైమిథోయేట్ 2మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5మిల్లీలీటర్లు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే 10రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారి చేయాలి.

● **తెల్లపొలుసు పురుగులు:** పొలుసు పురుగులు ఎక్కువగా కాండంపై ఆశించి సున్నం పూసినట్లు కనబడతాయి. కాండం, కొమ్మల్లో రసాన్ని పీల్చేసి ఎండిపోతాయి.

నివారణ చర్యలు: ఈ పురుగులు ఆశించిన చోట గోనె సంచితో రుద్ది మిథైల్‌డెమటాన్ లేదా డైమిథోయేట్ 2 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి కాండం, కొమ్మలపై పిచికారి చేయాలి.

● **నల్లి పురుగులు:** నల్లి పురుగుల్లో ఆకుపచ్చ నల్లి, మంగు నల్లి ముఖ్యమైనవి. ఆకునల్లి ఆకులపైన, మంగునల్లి కాయలపైన ఆశించి రసాన్ని పీల్చివేస్తాయి. దీనివల్ల కాయలపై చిన్న చిన్న తెల్లని మచ్చలు లేదా ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కాయ అంతటా మంగు ఏర్పడుతుంది.

నివారణ చర్యలు: నీటిలో కలిగే గంధకం 3గ్రాములు లేదా డైకోఫాల్ 5.0మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే నివారణ అవుతుంది.

● **వేరుకుళ్లు తెగులు:** వేరు కుళ్లు తెగులు ఆశించిన చెట్టుకు పోషక పదార్థాలు అందక చెట్లు ఎండిపోతాయి. తె గులు ఆశించిన చెట్లు ఎక్కువ పూతపూ సి కాయలు ముదిరేలోగా చెట్టు వాడి ఎండిపోతాయి. ఈ చెట్ల వేరును పరీక్షిస్తే కుళ్లిన వాసన వస్తుంది.

నివారణ చర్యలు: వ్యాధిసోకిన తొలి దశలోనే గమనించి చెట్టుకు ఎక్కువగాన నీరు కట్టి మరుసటి రోజు కార్బండజిమ్ 2గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5గ్రాములు లేదా చెషంట్ 3గ్రాములు లేదా ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని లీటరు నీటిలో కలిపి చెట్టు చుట్టూ నేల తడిసేలా పిచికారీ చేయాలి. చెట్టుకి కావాల్సిన పోషక పదార్థాలు సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ద్వారా అందించాలి. ఒక కిలో ట్రైకోడెర్మా మందును 90 కిలోల పశువుల ఎరువు 10 కిలోల వేపపిండితో కలిపి 15రోజులు మాగపెట్టి చెట్టు మొదలు చుట్టూ వేయాలి. ఇలా చేస్తే చెట్టును ఈ తెగులు నుంచి కాపాడవచ్చు.

● **రసం పీల్చే రెక్కల పురుగులు:** రెక్కల పురుగులు పండ్లపై రంధ్రాలు చేసి కాయలో ఉండే రసాన్ని పీల్చుతాయి. కాయలకు చేసిన రంధ్రాలతో శిలీంద్రాలు, బ్యాక్టీరియా చేరి పండ్లు కుళ్లి రాలుతాయి.

నివారణ చర్యలు: పురుగులు ఆశించి కుళ్లి, రాలిపోయిన కాయల ను ఏరి నాశనం చేయాలి. పురుగులను నాశనం చేయడానికి మలాథి యాన్ మిల్లీలీటరు మందుకు ఒక శాతం పంచదార, పండ్ల రసం కలి పి చెట్ల కింద అమర్చాలి. పురుగులను ఆకర్షించడానికి బల్బులను ఏ ర్పాటు చేస్తే పురుగులను అరికట్టవచ్చు. పురుగుల నుంచి కాయలను రక్షిం చడానికి కాయలను బుట్టలను ఏర్పాటు చేస్తే మంచి ఫలితం.

● **బంక తెగులు:** బంక తెగులు రెండు రకాలు. ఒకటి పెటిఫ్తోరా, రెండు డిప్లోడియా. మొదటి తెగులు ఆశించిన చెట్టు నుంచి ధారాళంగా బంక కారుతుంది. ఇది చెట్టు వేళ్లకు, మొదలు కింది భాగానికి పరిమితమై ఉంటుంది. డిప్లోడియా బంక తెగులు చెట్టు మొదలు పైభాగాన కొమ్మల పంగల్లో ఎక్కువగా ఆశిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా ఉంటే బంక కారడం, బెరడు కుళ్లడం జరుగుతుంది. నీరు త్వరగా ఇంకని భూముల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుంది.

నివారణ చర్యలు: బంకా కారి కుళ్లిన బెరడును పూర్తిగా తొలగించి బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ పేస్టు పూయాలి. ఈ పేస్టును మొదలు చుట్టూ పూయాలి. కొమ్మలపై వచ్చే బంక తెగులు నివారణకు లీటరు నీటికి 1గ్రాము కార్బండజిమ్ కలిపి చెట్టు మొత్తం తడిసేలా పిచికారీ చేయాలి. మెటలాక్సిన్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదలులో పోయాలి.

న్యూస్ బాక్స్

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జొన్నవాడ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో మంగళవారం అమ్మవారికి లక్షకుంకు మార్చన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా 20మందికి పైగా అర్చకులు లలితా సహస్ర నామార్చన చేపట్టారు. పూజలకు ముందు ఉభయకర్తలు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రస్తాలు స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు చందనాలంకరణ



బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేబాల గ్రామ దేవత పుట్టాలమ్మకు అర్చకులు చందనాలంకరణ చేసి భక్తులను దర్శనానికి వదిలారు. ఇలా 3 మంగళవారాలు, 3ఆదివారాలు చద్ది, చలిపిండి, పానకాలు సమర్పించే కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు చద్ది నివేదన సమర్పించుకున్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఇరిగేషన్ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

● అసెంబ్లీలో ప్రస్తావించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ స్థలాల ఆక్రమణల తొలగింపులో ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పినా వినకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రస్తావించారు. టీపీ గూడూరు మండలానికి ప్రధాన సాగు నీటి వనరైన కోడూరు కాలువ, వరిగొండ పంచాయతీ రావూరువారికండ్రిగలో 2ఎకరాల విస్తీర్ణంలోని కాలువ, వెంకటాచలం మండలం చెముడుగుంట పరిధిలోని కాలు వలు ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. పొద లకూరు మండల పరిధిలోని కండలేరు ఎ డమ కాలువ అలైన్మెంటు మార్చేశాని తెలి పారు. పొదలకూరు పట్టణ పరిధిలో పొట్టే ళ్ల కాలువను పూడ్చేస్తే తాను అధికారుల ను పంపి రిస్టోర్ చేయించానన్నారు. లేఅవు ట్లలో బడి, గుడి, మసీదు, చర్చి కట్టడానికి 10శాతం స్థలం వదలడం లేదన్నారు. కొన్ని లేఅవుట్లలో మొదట ఓపెన్ స్పేస్ చూపి చివరలో ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారని చెప్పారు. సమస్యలపై చర్యలు తీసుకోవాల ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. ఇరిగేషన్ అధికారులతో స మీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటామని మం త్రి నిమ్మల హామీ ఇచ్చారు.



మద్దతు ధర కల్పించినందుకు సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలతో ధాన్యం విక్రయాలపై ప్రత్యేక చొరవచూపి మద్దతు ధర కల్పించిన బుచ్చి తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుచ్చి, పెనుబల్లి, దామరమడుగు, పంచేడు, మినగల్లు, రేబాల, ఇస్కపాళెం, తదితర గ్రామాల రైతులు 50మంది శాలువా, పూలమాలతో సన్మానించారు. అలాగే వవ్వేరు బ్యాంకు సీఈఓ శ్రీనివాసులును సత్కరించారు. మిల్లర్లు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు మోసపూరిత విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం చేశారని తహసీల్దారును రైతులు కొనియాడారు. ఖరీఫ్ సీజన్‌లోనూ ఇలాంటి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో అమరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీటీసీ సీహెచ్.నారాయణ, సురేష్‌రెడ్డి, బొర్రరాము, కొక్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.



తహసీల్దారు, బ్యాంకు సీఈవోను సత్కరించిన రైతులు

ఏప్రిల్ నెలాఖరులోగా రీసర్వే పనులు పూర్తి చేస్తాం: జేసీ



తహసీల్దారుతో వివరాలు మాట్లాడుతున్న జేసీ కార్తీక్

మనుబోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏప్రిల్ నెలాఖరులోగా రీ సర్వే పూర్తవుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ కార్తీక్ వెల్లడించారు. పిడూరులో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ మారు భూముల కొలతలు ఖచ్చితంగా ఉంటాయన్నారు. ప్రతి పట్టాదారుడికి సర్వే వివరాలు తెలిపేందుకు సెక్షన్ 9(2) నోటీసు అందజేస్తామన్నారు. దాన్ని తీసుకుని రైతు సరిచూసుకోవాలన్నారు. ఏదైనా తప్పులుంటే సదరు సర్వే అధికారులకు తెలపా లన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ రఘురా మరాజు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ రాము, తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, సర్వేయర్ శ్రీనువాసులు, రీసర్వే డీటి మంజుల, ఆర్ఐ. శ్రీకాంత్, వీఆర్వో శ్రీనువాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం దళారులపై పట్టాభి ఆగ్రహం

● తాటిపర్తి కొనుగోలు కేంద్రం పరిశీలన
● ప్రభుత్వ ప్రణాళికపై రైతులకు క్లుప్తంగా వివరణ

పొదలకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రంను మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్యూలింగ్ గురించి క్లుప్తంగా వివరించారు. రైతుల సౌకర్యార్థం ప్రతి రైస్‌మిల్లు కట్టిన బ్యాంకు గ్యారెంటీకి ఒకటిన్నర రెట్లు అధికంగా ధాన్యం తీసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. గ్రేడ్ ఏరకం ధాన్యం పుట్టికి రూ.19,720 ధర నిర్ణయించినట్లు చెప్పారు. కొనుగోలు చేసిన 24గంటల్లోపే అకౌంట్లోకి నగదు జమ అవుతుందని తెలిపారు. ప్రభుత్వ వాట్సప్ నెంబరు 73373 59375కి మీ వాట్సప్ నెంబర్ నుంచి హాయ్ అని మెసేజ్ పెడితే మీరు ధాన్యం అమ్మకానికి సిద్ధమైనట్లు పీపీసీకి సమాచారం అందుతుందని చెప్పారు. రైతుల వద్ద మద్ధతు ధర కంటే తక్కువ కొనుగోలు చేయరాదని దళారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బాలిరెడ్డి హనుమారెడ్డి, పల్లవరపు కృష్ణ, సుబ్బారామిరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి

గ్రామకంఠం స్థలాలు, ఇళ్లకు ధ్రువీకరణ పత్రం

● రుణ సదుపాయం కోసం కొత్త పథకం అమల్లోకి తేనున్న కేంద్రం
● ఇలా చేస్తే గృహ లబ్ధిదారులకు ఊరటే..

ఇందుకూరుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గ్రామీణప్రాంత ప్రజలు తమ అవసరాలకు రుణాలు పొందేందుకు బ్యాంకులను ఆశ్రయిస్తే రుణం దొరకడం కష్టంగా మారింది. వ్యవసాయ భూములకు పాసుపుస్తకాలు ఉన్న వారికి మాత్రం అప్పులు ఇస్తున్నారు. ఇల్లు తాకట్టు పెట్టుకుని రుణాలు పొందాలంటే గ్రామకంఠంలో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేక దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం చర్యలు తీసుకోనుంది. గ్రామీణ ప్రజల ఆస్తుల విలువలను ధ్రువీకరించేందుకు స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అబాది అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్ టెక్నాలజీ ఇన్‌విలేజ్ ఏరియాస్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇది పూర్తయితే గ్రామీణ ప్రజల ఆస్తులు, భవనాల సంపూర్ణ సమాచారం వారి చేతిలోకి వస్తుంది. రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

● **మెజార్టీ ఇళ్లు గ్రామ కంఠం పరిధిలోనే..**

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు చాలావరకు ప్రస్తుతం గ్రామ కంఠంగా నమోదై ఉన్నాయి. దీంతో ఇల్లు అమ్మాలన్నా, కొనుగోలు చేయాలన్నా సమస్యలు ఎదురవుతున్నాయి. అలాగే వారసుల పేర్లపై బదలాంపు జరగడం లేదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అందుకు సంబంధించి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు నిధులు సమ కూరుస్తుంది. తొలుత రెవెన్యూ, సర్వే యంత్రాంగం ఆయా గ్రామాల హద్దులు గుర్తిస్తుంది. అనంతరం పార్కులు, చెరువులు, పాఠశాలలు, రహదారులు, ఆలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలపై సర్వే చేసి ప్రభుత్వ ఆస్తులపై పూర్తి స్పష్టత వస్తుంది. ఆ తర్వాత గృహాలకు హద్దులు నిర్ణయిస్తారు.

● **డ్రోన్ ద్వారా చేపట్టనున్న సర్వే**

సర్వే నిర్వహించే గ్రామంలో డ్రోన్ సహాయంతో ప్రతి ఇంటికి సంబంధించిన ఫొటోలు తీస్తారు. ఇది పూర్తయ్యాక పంచాయతీరాజ్ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటి యజమాని పేరు, డోర్ నెంబరు, ఎప్పుడు ఇల్లు నిర్మించుకున్నారు వంటి వివరాలు సేకరిస్తారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ సహాయకుడు ఇల్లు లేదా భవన విస్తీర్ణం ఎంత? ఖాళీ స్థలం ఎంత? తదితర వివరాలు నమోదు చేసుకుంటారు. గత ప్రభుత్వ హయంలోనే ఈ కార్యక్రమం మొదలైంది. కొందరికి ఆస్తి ధ్రువపత్రాలు కూడా పంపిణీ చేశారు. అందులో అనేక తప్పిదాలు దొర్లాయి. అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పొరపాట్లు సరిదిద్దే చర్యలకు ఆదేశాలు వచ్చాయి. గతేడాది డిసెంబరు నెలా ఖరు నుంచే ఈ పనులు ప్రారంభం అయ్యాయి. ఆస్తి ధ్రువ పత్రాలు అందజేసిన వారికి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేస్తున్నారు. కుటుంబ అవసరాల కోసం ఆస్తిని విక్రయించాలనుకుంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి ఇతరులకు అమ్ముకునే వీలుంటుంది. బ్యాంకు రుణాలు పొందవచ్చు.

C.R.I.M.E N.E.W.S

స్నేహితులే హంతకులు

● చింటు హత్య కేసులో ఆరుగురి అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి): ఆపదలో అండగా నిలవాల్సిన స్నేహితులే కిరాతకులుగా మారారు. మాట్లాడుకుందాం రా... అంటూ పిలిచి కత్తులతో నరికి హత్యచేశారు. నెల్లూరులోని ఇందిరాగాంధీ నగర్‌లో ఈనెల 14న రాత్రి జరిగిన రౌడీషీటర్ చింటు హత్య కేసులో పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను వేదాయపాళెం స్టేషన్‌లో నగర డీఎస్పీ పీ సింధుప్రియ స్థానిక ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులురెడ్డితో కలిసి విలేకర్లకు తెలిపారు. పాతవేదాయపాళేనికి చెందిన రౌడీషీటర్ అరవభూమి సుజన్ కృష్ణారెడ్డి అలియాస్ చింటు(28)పై పలు కేసులున్నాయి. అతనికి ఇందిరాగాంధీనగర్‌కు చెందిన కృష్ణసాయి అలియాస్ కిట్టు స్నేహితుడు. వీరి మధ్య పాత గొడవలున్నాయి. అది మనసులో పెట్టుకుని స్నేహితులైన కరిముల్లా, షేక్ మహ్మద్‌బాబా, జీ పవన్, ఫ్రాన్సిస్ అనిక్‌రాజ్ అలియాస్ అనిక్‌రాజ్, కే సాయితేజతో కలిసి చింటును హత్య చేయాలని నిర్ణయించాడు. సరైన సమయం కోసం ఎదురుచూస్తుండగా చింటు ఇందిరాగాంధీ నగర్‌లో ఓ యువతిని ప్రేమిస్తున్నాడని, ఆమెను కొందరు ఇబ్బంది పెడుతున్నారని తెలుసుకున్నాడు. ఈ విషయమై ఈనెల 14న రాత్రి చింటుకు ఫోన్ చేసి మాట్లాడుకుందాం ఇందిరాగాంధీనగర్ రెండవ వీధికి రావాలని పిలిచాడు. చింటు అక్కడికి రాగానే స్నేహితులతో కలిసి కత్తులతో నరికి పరారయ్యారు. చింటు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. మంగళవారం వెంగళరావునగర్‌లో ఆరుగురురిని అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

టిప్పరు బోల్తా : డ్రైవరు,క్లీనర్‌కు గాయాలు



సిద్ధవరం మలుపు వద్ద బోల్తా పడిన టిప్పరు

రాపూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మండలం సిద్ధవరం గ్రామ సమీపాన ఉన్న మలుపు వద్ద మంగళవారం వేకువన టిప్పరు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. తిరుపతి నుంచి నెల్లూరుకు వెళ్తున్న టిప్పరు డ్రైవరు పొగమంచులో మలుపును గమనించక రోడ్డు డివైడరును దాటి బోల్తా కొట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలం చేరుకుని విచారించారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు



పోలీసులకు పట్టుబడిన పేకాట రాయుళ్లు

రాపూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సైదాదుపల్లి గ్రామ సమీ పంలోని అటవీ ప్రాం తంలో మంగళవా రం సాయంత్రం ఎస్‌ఐ వెంకట రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు కోడిపందేలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది నిర్వాహకులతో పాటు రూ. 6,800 నగదు 13 బైక్‌లు, 11 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



శివ మృతదేహం

బిట్రగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గిరిజన కాలనీకి చెందిన మల్లవరపు శివ (45) సోమవారం రాత్రి అదే కాలనీకి చెందిన ఈగ జీవరత్నంతో కలిసి మోటారు బైకుపై బోగోలుకు వచ్చి తిరిగి వెళుతుండగా బోగోలు మండలం తాళ్లూరు పంచాయతీ చైతన్యనగర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ శివ మృతి చెందాడు. జీవరత్నంను చెన్నైకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కలువాయి, మార్చి 18 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను మంగళవారం రాత్రి తోపుగుంట సమీపంలో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సుమారు 10 బస్తాల (500కేజీలు) బియ్యం ఆటోలో తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. చేజర్ల మండలం నాగులవెల్లటూరుకు చెందిన ఓ వ్యక్తి ఈ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. మండలం నుంచి ప్రతి నెలా రేషన్ బియ్యం పెద్ద ఎత్తున అక్ర మంగా తరలిస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరుగుతుంది. ఆ సమయంలో ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు కొనుగోలు చేసిన బియ్యం స్థానికంగా పలు చోట్ల దాచి ఉంచుతారు. 17 తరువాత నుంచి ఈ బియ్యం మండలం దాటిస్తుంటున్నారు. ఇలా దాచి ఉంచిన అక్రమ బియ్యం తరలిస్తుండగా పోలీసులకు చిక్కింది. పౌరసరఫరాలశాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలుతోంది. పట్టుబడిన బియ్యంపై అధికారులు విచారణ జరిపితే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

ఉదయగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీ సీ కాలనీ సమీపంలో సోమవారం రాత్రి 167-బీజీ జాతీయ రహదా రిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని సీతారామపురం మండలం సం జీవరెడ్డినగర్ గ్రామానికి చెందిన ఐదు గేదెలు, మూడు దూడలు మృతి చెందాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ హరిరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మంగళవారం తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 510

18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్చండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా చేర్చాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులకు సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల వారీగా 18 ఏళ్లు నిండిన వారి వివరాలు సేకరించి ఓటు హక్కు కల్పించాలన్నారు. అనంతరం నిర్వహించిన రెవెన్యూ సమీక్షలో మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్లలో మొండి బకాయిదారులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించాలని సూచించారు. ఈ నెలాఖరులోపు ఆర్ఐలు, సచివాలయ అడ్మిన్లు లక్ష్యాలను అధిగమించాలని స్పష్టం చేశారు. కాగా, కమిషనర్ ఉదయం 6వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. మేయర్ స్రవంతి సిటీప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్రమ నిర్మాణాలపై ప్రజలకు అవగాహన పెంచాలని సూచించారు.

న్యూస్ బాక్స్

సీఎంకు కృతజ్ఞతలు

● ఆర్యవైశ్య నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టిశ్రీరాములు అందరికీ స్ఫూర్తి అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొనడం ఆర్యవైశ్యులందరికీ ఆనందాన్నిచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి షేగు షణ్ముఖరావు, రాష్ట్ర చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, ఉపాధ్యక్షులు మెంటా గురుబ్రహ్మం తెలిపారు. మంగళవారం నెల్లూరుజిల్లా రైస్ క్యాన్వాస్ ఏజెంట్ల కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పొట్టి శ్రీరాములు చేపట్టిన 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహాన్ని, స్మృతి వనాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తామని చెప్పడం హర్షదాయకమన్నారు. ఈ సమావేశంలో ఈసీ మెంబర్లు దర్శి హరికృష్ణ, భవనాపి సురేష్, కన్యకాపరమేశ్వరి ఆలయ గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనేయులు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీపార్కులో మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, కేతా అంకులు ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు, కాంగ్రెస్ నాయకుడు అరవ రామ్మోహన్‌రావు, బెడదడోలు రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

మనోహర్ దాస్‌పై చర్యలు తీసుకోండి

నెల్లూరు(క్రైం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్‌పై చర్యలు తీసుకోవాలని నెల్లూరు క్రీస్తు దళం సభ్యులు మంగళవారం దర్గామిట్ట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రోశయ్యకు ఫిర్యాదు చేశారు. దళం సభ్యుడు బర్నాబాసు మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియాలో క్రీస్తు విగ్రహాలపై మూత్ర విసర్జన చేయాలని, పాస్టర్లను జైలుకు పంపాలని చేసిన వ్యాఖ్యలకు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఊరందూరు సురేంద్రబాబు, ఐఎస్ బెన్‌హర్‌బాబు, యేసురత్నం, రాజశేఖర్, శశి, సంతోష్, జాషువ, తదితరులు పాల్గొన్నారు.

జెనెక్స్ కళాశాలలో నేడు క్యాంపస్ డ్రైవ్

నెల్లూరు(విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెనెక్స్ విజన్ కళాశాలలో బుధవారం టీఎస్ స్మార్ట్ అండ్ ఇగ్నైట్ హైరింగ్ ఐటీ రోల్ కోసం పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు రాత పరీక్ష నిర్వహించి అర్హత పొందిన వారికి ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారన్నారు. గతేడాది బీఎస్సీ కంప్యూటర్స్, బీసీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

మూడు గొర్రెల చోరీ

నెల్లూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆమంచర్ల గ్రామ పంచాయతీ సేవా జ్యోతికాలనీలో యనమల లక్ష్మీనారాయణకు చెందిన మూడు గొర్రెలు అపహరణకు గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడని రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'ఆదరణ'పై అభిప్రాయాలు ఇవ్వండి

● ఎంపీడీవో శైలేంద్ర

నెల్లూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టబోతున్న ఆదరణ-3 పథకంపై అభిప్రాయాలు అందచేయాలని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్ర కుమార్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కుల సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. వివిధ కుల వృత్తిదారులను వృత్తిపరంగా ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ మృతి



నెల్లూరు(క్రైం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కే లక్ష్మీ నరసయ్య అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అక్కడే తుది శ్వాస విడిచారు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెండుసార్లు పనిచేశారు. ఆయన మృతికి జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు శ్రీహరి సంతాపం తెలిపారు.

రూల్స్ ఎన్ని ఉన్నా

మా రూటు 'డుమ్మా'!

నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో వైద్యులు ప్రతీరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలి. ఈ నెల 13న విజయవాడ నుంచి వచ్చిన డీఎంఈ అడ్మిన్ డాక్టర్ వెంకటేష్ ఆకస్మికంగా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఉదయం 11 గంటలకే పలువురు వైద్యులు విధులకు డుమ్మాకొట్టి వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఆయా వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పెద్దాసుపత్రిలో డాక్టర్ల సమయపాలనకు ఈ ఘటనే నిదర్శనం.



- జీజీహెచ్‌లో విధులకు హాజరుకాని వైద్యులు
- ఎఫ్ఆర్ఎస్ తెచ్చినా అనుకూలంగా మార్పు
- చేతులెత్తేసిన పర్యవేక్షక అధికారులు
- డీఎంఈ అడ్మిన్ పరిశీలనలో గుర్తింపు
- కాసేపు ఉండి ఆపై సొంత క్లినిక్‌లకు పయనం
- రోగులు పరీక్షలకు వెళ్లొచ్చేలోపు మాయం

నెల్లూరు (వైద్యం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లో వైద్యులు ఇష్టం వచ్చినట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అసలు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్లిపోతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. సమయ పాలన విషయంలో ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినా, ఉన్నతాధికారులు ఎవరు చెప్పినా, హెచ్చరించినా డాక్టర్ల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. కాసేపు సీట్లో కూర్చొని ఆ తర్వాత సొంత పనులపై తుర్రు మంటున్నారు. నిత్యం వెయ్యి మందికిపైగా రోగులు వచ్చే ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో ఆ రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ హాజరు వచ్చినా ఏం లాభం!

వైద్యుల హాజరుకు సంబంధించి ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆ తర్వాత ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టమ్ (ముఖ హాజరు)ను తీసుకు వచ్చిందా. అయితే ఏ విధానాన్ని అమలు చేసినా వైద్యులు దాన్ని వారికి అనుకూలంగా మార్చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఉదయాన్ని ముఖ హాజరు వేసి ఓ రెండు గంటల పాటు ఆసుపత్రిలో ఉండి ఆ తర్వాత సొంత, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి పోతున్నారు. కొందరు వైద్యులకు బయటి జిల్లాల్లో సొంత క్లినిక్‌లు ఉండటంతో జీజీహెచ్‌కు వారానికి మూడు రోజులే వస్తున్నట్లు విమర్శలు న్నాయి. ఆసుపత్రిలో 229 మంది వైద్యులు ఉండగా మంగళవారం 195 మంది హాజరు అయినట్లు ముఖ హాజరు ద్వారా వెల్లడవుతోంది. కానీ, వారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోయినట్లు సమాచారం. వైద్యులు పూర్తి సమయంలో ఆసుపత్రిలో ఉండేలా, రోగులకు సేవలు అందించేలా చేయడంలో అటు ఉన్నతాధికారులు గానీ, ఇటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీగానీ పటిష్ట చర్యలు చేపట్టలేక పోతున్నాయి.



రోగులు పరిస్థితి అధ్వానం

కొందరు వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకాకపోవటంతో సీనియర్ రెసిడెంట్ వైద్యులు, నర్సింగ్ సిబ్బందే రోగులకు దిక్కవుతున్నారు. ప్రసూతి విభాగంలో పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నా మిగిలిన విభాగాల్లో మాత్రం వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కావటం లేదు. ఉదయాన్నే రోగులను పరీక్షించి వ్యాధి నిర్ధారణ పరీక్షలకు చీటీ రాస్తున్నారు. తీరా ఆయా పరీక్షలు చేయించుకుని ఫలితాలను చూపించడానికి వచ్చేసరికి సదరు డాక్టర్లు ఉండటం లేదు. దీంతో చేసేదిలేక రోగులు మరుసటి రోజు మరలా ఆసుపత్రికి రావాల్సి వస్తోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇది తీవ్ర అసౌకర్యం, అదనపు ఖర్చుగా మారుతోంది. ఇప్పటికైనా వైద్యుల హాజరుపై ఉన్నతస్థాయి పర్యవేక్షణ, పటిష్ట చర్యలు అవసరమని రోగులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



విధులకు సక్రమంగా హాజరు కాని వైద్యులపై చర్యలకు సిద్ధమవు తున్నాం. ఇటీవల డీఎంఈ అడ్మిన్ ఆకస్మిక తనిఖీలో వైద్యులు విధుల్లో లేరని గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తాం. వైద్యులు కచ్చితంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సిందే!. దీన్ని అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు.

- డాక్టర్ సిద్దా నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్



పుణ్యకోటి విమానంలో రంగడి విహారం

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు మంగళవారం రాత్రి పుణ్యకోటి విమానంలో విహరించారు. ఉదయం ముసుగుల సేవ జరిగింది. స్వామి, అమ్మవార్ల మధ్య ప్రణయ కలహోత్సవాన్ని అర్చకస్వాములు నయనానందకరంగా నిర్వహించారు. తర్వాత చక్రస్నానం, తీర్థవాది వేడుకలు జరిగాయి.

సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

● ఇఫ్కో చైర్మన్, సీఈవోతో ఎంపీ వేమిరెడ్డి భేటీ

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ కోసం సేకరించిన 2777 ఎకరాల్లో అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం ఢిల్లీలోని ఇఫ్కో కిసాన్ సెజ్ చైర్మన్ దిలీప్ సంఘాని, సీఈవో ఉదయ్ శంకర్ అవస్థిని కలిశారు. ఇప్పటికే సెజ్‌లో 150 ఎకరాల్లో సిమెన్స్ గమేసా సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందని, హిందుస్థాన్ కోకో కోలా బేవరేజెస్ లిమిటెడ్ తమ యూనిట్ల కోసం 150 ఎకరాలు తీసుకుందని చెప్పారు. ఇతర పెట్టుబడిదారులు కంపెనీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటైతే జిల్లాలో వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీనికి చైర్మన్, సీఈవో సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.



ఇఫ్కో కిసాన్ సెజ్ చైర్మన్ దిలీప్ సంఘానితో ఎంపీ వేమిరెడ్డి

వాట్సప్ సేవలపై అవగాహన కల్పించాలి

● శాసనసభలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వాట్సప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంగళవారం శాసనసభలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని ఆమె కొనియాడారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోకుండా వాట్సప్ గవర్నెన్స్‌పై గ్రామ స్థాయిలో సచివాలయాల ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేలకు కూడా దీనిపై అవగాహన కల్పిస్తే క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేసేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయప డ్డారు. మన మిత్ర వాట్సప్ నెంబర్ ద్వారా జనన మరణ ధ్రువీకరణ పత్రాలు వాట్సప్‌లో అందుబాటులోకి రావడంతో ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పిందన్నారు.



వేదగిరీశుడికి తిరుప్పావడ సేవ

నెల్లూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం తిరుప్పావడ సేవ జరిగింది. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ సేవను నిర్వహించారు. ముందుగా మూలమూర్తికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, అర్చన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఈవో గోపీ, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై యాత్రలు : సీపీఎం



సీపీఎం నెల్లూరు రూరల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కొండా ప్రసాద్

నెల్లూరు (వైద్యం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాచైతన్య యాత్రలు నిర్వహి స్తున్నట్లు సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం రూరల్ సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16న జరిగిన పార్టీ రూరల్ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. నగరంలో రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో స్థానిక సమస్యలపై ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, పెంచల నర్సయ్య, రఫీ అహ్మద్, సంపత్ కుమార్, షాహినాబేగం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపడంతో నగరంలో మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాల నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ జేఏసీ గౌరవాధ్యక్షుడు వందిటి సుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్గీకరణ దిశగా అడుగులు వేయడం ఆనందంగా ఉందన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న నాయకులు

23న మాలల మహాగర్జన

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తిరుపతిలో ఈనెల 23న ఐదు లక్షల మందితో మాలల మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య తెలిపారు. నగరంలోని ఒక సమావేశ మందిరంలో ఈ గర్జన ఏర్పాట్లపై మంగళవారం మాల మహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలుపడాన్ని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో యమల సుదర్శనం, అశోక్, దాసరి చెన్నకేశవులు, బల్లి వెంకయ్య, ఈదూరు విజయకుమార్, హరి, ఏసునాయుడు, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణ వెంకయ్య

'ఫుట్‌బాల్ సూపర్‌కప్‌లో సత్తా చాటాలి'

నెల్లూరు(విద్య), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ సూపర్ కప్‌లో కోరమండల్ ఫుట్‌బాల్ క్లబ్ సత్తా చాటాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి ఆకాంక్షించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొన్న జట్టు క్రీడాకారులకు మంగళవారం క్రీడాదుస్తులను అందించి మాట్లాడారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్‌డీటీ మైదానంలో ఈనెల 20 నుంచి 27 వరకు జరగనున్న ఏపీ సూపర్‌కప్‌లో 8 ఫుట్‌బాల్ క్లబ్‌లు తలపడనున్నాయని చెప్పారు. నెల్లూరు నుంచి హాజరవుతున్న కోరమండల్ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధి మలిరెడ్డి ప్రీతమ్‌రెడ్డి, జట్టు కోచ్ కృష్ణారెడ్డి, కెప్టెన్ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర పోటీలకు హాజరవుతున్న కోరమండల్ క్లబ్ క్రీడాకారులు

అవగాహనతోనే సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట

● రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయని, వాటిని అడ్డుకోవాలంటే అవగాహన ఒక్కటే మార్గమని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు గ్రామీణులకు సూచించారు. మంగళవారం మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన సాంకేతికతను దోచుకెళ్లేందుకు సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారని చెప్పారు. సెల్ ఫోన్లకు ఆసక్తికర సమాచారం, అనుమానస్పద లింకులు, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే స్పందించవద్దని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని, వాటితో జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చెప్పారు. మద్యానికి దూరమైతే కుటుంబం దగ్గరవుతుందని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ గుంజి వేణు, ఎస్ఐ లక్ష్మణరావు, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత అచ్యుతరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పొట్టేపాళెంలో నాయకులతో మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ

బహిరంగ ప్రకటన

... M/s. Shriram Finance Ltd., Atmakur ... Sri Tayanuru Chengamma W/o Late Gandhi, Arunachalam Street, G.V.S. Complex, Stonehousepet, Nellore City ... Tayanuru Malleswari D/o Late T.Gandhi ...

SCHEDULE

... L.P.No. 129/2015/G ... "Central @ Nellore" ... 183.33 ...

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

ఈ నెల 21న బ్రహ్మాండమైన విడుదల



రైన్ సినిమాస్ - నెల్లూరు
కోటేశ్వర - కందుకూరు

గ్రామ పంచాయితీ కార్యాలయము విడవలూరు గ్రామ పంచాయితీ
విడవలూరు మండలం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.5/2025 తేది:19-03-2025

టెండర్ నోటీసు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, విడవలూరు మండలం, విడవలూరు గ్రామ పంచాయితీ ఏరియాలో 2025-26 సం..మునకు గాను అనగా 01-4-2025 నుండి 31-03-2026 వరకు గ్రామ పంచాయితీ నందు కాంట్రాక్టు పద్ధతిపై వివిధ సేవలు నిర్వహించుటకు గ్రామ పంచాయితీకి ప్రతిరోజు సిబ్బందిని సమకూర్చుటకు ఆసక్తి గల కాంట్రాక్టర్లు నుండి తేదీ 24-3-2025 ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు ఈ క్రింద తెలిపిన విధముగా నిర్ణీత ధరావత్తు పంచాయితీ కార్యాలయము నందు చెల్లించి రశీదు టెండరు షెడ్యూలులో జతపరిచి టెండరు దాఖలు చేయవలెను

నెం	వివరములు	ధరావత్తు మొత్తం
1.	స్వీపర్లు పారిశుద్ధ్య పని 10మంది	2000/-
2.	P.W.S పంపు ఆపరేటర్లు 14 మంది (మొత్తం 24 మంది)	

నిబంధనలు మరియు వివరములు కొరకు కార్యాలయము పనివేళలందు వచ్చి తెలుసుకొనవచ్చును. షరతులు వర్తించును.

సం/- షేక్ యస్‌ధానిబాషా
పంచాయితీ కార్యదర్శి, విడవలూరు గ్రామ పంచాయితీ విడవలూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



సత్యవేడు మండలం చెన్నేరిలో గ్రావెల్ తవ్వకాలు

సమీపంలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలు

చెలరేగుతున్న మట్టి మాఫియా

- చెన్నేరి గిరిజన భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- నాలుగేళ్ల క్రితం పొందిన అనుమతులతో కొనసాగింపు

సత్యవేడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇష్టానుసారం సాగిన గ్రావెల్ తవ్వకాలకు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బ్రేక్ పడినట్లే కనిపించింది. మళ్లీ కొన్ని రోజులుగా కోరలు చాస్తోంది. సత్యవేడు మండలం దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి గ్రామం జగనన్న లే అవుట్‌కు అతి సమీపంలోని సర్వే నెం.82, 83లలోని 2.420 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాల కోసం 2022లో చెన్నైకు చెందిన ఓ బడా వ్యక్తి ఐదేళ్ల కాల పరిమితికి అనుమతులు పొందాడు. అయితే అనుమతులు ఇచ్చే ముందు అధికారులు కనీస నిబంధనలు సూచించకపోవడం వివాదానికి దారితీసింది. చుట్టూ నివాస గృహాలున్నా ఖాళీ ప్రాంతంగా చూపిస్తూ గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చేశారు. నివాస గృహాలకు దగ్గరలో చేపట్టే గ్రావెల్ తవ్వకాలతో తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని చెన్నేరి గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తవ్వకాలు ఆపాలని పలుమార్లు ఆందోళనకు దిగారు. వైసీపీ నేతల అండదండలతో సదరు కాంట్రాక్టరు గ్రామస్తులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తవ్వి తరలించారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పది నెలలుగా తవ్వకాలకు బ్రేక్ పడింది. అయితే రెండు వారాలుగా అదే ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. రాత్రీపగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లతో తవ్వి.. టిప్పర్లతో రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. అయినా, అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలున్నాయి.



చెదురుపాకంలోనూ మట్టి దందా

వరదయ్యపాళెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం చెదురుపాకం పంచాయతీలోని సర్వే నెం.32లో ఉన్న చెరువులో ఐదువేల క్యూబిక్ మీటర్ల మేర అనుమతులు పొందారు. అయితే అక్కడ గ్రావెల్ లేదనే కారణం చూపి జగనన్న కాలనీ సమీపంలో సర్వే నెం.307లో టిప్పర్ల సాయంతో తవ్వకాలు చేస్తున్నారు. అదే సమయంలో తమిళనాడుకు చెందిన కొందరు రైల్వే పనులకు అనుమతులు తెచ్చుకున్నామని చెప్పి జగనన్న కాలనీ సమీపంలో 308, 307 సర్వే నెంబర్ల వద్ద ఎక్స్‌కవేటర్ల సాయంతో సుమారు 30 టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారు. గతంలో అనుమతులు లేకపోయినా సర్వే నెం.32లోని చెరువు మట్టిని వైసీపీ నాయకులు తరలించారు.ఎక్కడో అనుమతులు పొంది డీకేటీ భూముల్లో ప్రజలకు డబ్బు ఆశ చూపించి మట్టిని అక్రమార్కులు తరలించుకుపోతున్నారన్న విమర్శలున్నాయి.

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంపు

- యూజీ విద్యార్థులకు రూ.10,500, పీజీకి 13,500, పీహెచ్‌డీకి రూ.15వేలు

తిరుపతిరూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2013 నవంబరు నాటికి ఫిక్స్ చేసిన స్టైఫండ్‌ని సవరిస్తూ జీవో జారీ అయింది. ఇప్పటివరకూ ఇంటర్న్‌షిప్ కాలంలో యూజీ విద్యార్థులకు నెలకు రూ.7వేలు అందిస్తుండగా..దాన్ని రూ.10,500కు పెంచారు. పీజీ విద్యార్థులకు రూ.9వేల నుంచి రూ.13,500కు, పీహెచ్‌డీ వారికి రూ.10వేలనుంచి రూ.15వేలకు పెంచారు. కాగా, స్టైఫండ్ పెంచాలని కోరుతూ వర్సిటీపరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫిబ్రవరి 3 నుంచి 44రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. విద్యార్థుల సమ్మె.. వారి డిమాండ్‌ను ఇటీవల ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఈ క్రమంలో స్టైఫండ్‌ని ప్రభుత్వం పెంచింది. వైద్యవిద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ ఇవ్వాలని, అరకొరగా పెంచిన స్టైఫండ్‌తో సంతృప్తికరంగా లేమని విద్యార్థులు అంటున్నారు. తమ డిమాండు మేరకు స్టైఫండ్ పెంచేవరకు సమ్మె కొనసాగిస్తామని చెబుతున్నారు.



తిరుమలలోని డీ టైప్ క్వార్టర్స్ వద్ద మద్యం మత్తులో వీరంగం చేస్తున్న యువకులు

తిరుమలలో మద్యం మత్తులో యువకుల వీరంగం

- దారిన వెళ్లే ముగ్గురు కూలీలపై దాడి
- ఆటోమొబైల్ వాహనం అద్దాలు ధ్వంసం

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు తిరుమలలో వీరంగం సృష్టించారు. దారిన వెళ్లే ముగ్గురు కూలీలపై దాడి చేయడంతో పాటు వాహనాలనూ అడ్డుకుని భక్తులను హడలెత్తించారు. శ్రీకాంత్, కోటి అనే ఇద్దరు అన్నదమ్ములు పూటుగా మద్యం తాగి సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరుమలలోని డీటైప్ క్వార్టర్స్ వద్దకు చేరుకున్నారు. మద్యం మత్తులో బిగ్గరగా కేకలు వేస్తూ రోడ్డుపై వెళ్లే వాహనాలకు అడ్డుపడ్డారు. ఆ సమయంలో దారిన వెళ్లే ముగ్గురు భవన నిర్మాణ కార్మికులపై దాడికి దిగారు. యువకుల చేష్టలకు భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. షర్టు కూడా లేకుండా రక్త గాయాలతో ఉన్న వారిని చూసి కొందరు భయంతో తమ వాహనాలను వెనుక్కు తిప్పుకొని వెళ్లాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న విజిలెన్స్, పోలీసు అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మద్యం మత్తులో ఉన్నవారిని ఏమాత్రం అదుపుచేయడం సాధ్యం కాలేదు. అదనపు సిబ్బంది వచ్చి బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ వెకిలి నవ్వులు, అరుపులతో వీరంగం చేశారు.వారిని తరలించేందుకు వచ్చిన ఆటోమొబైల్ వాహనాల అద్దాలను కూడా ధ్వంసం చేశారు. ఈక్రమంలో అద్దం ముక్కలు తగిలి ఓ విజిలెన్స్ ఏవీఎస్వో చేతికి చిన్నపాటి రక్తగాయాలయ్యాయి. సుమారు 40 నిమిషాల తర్వాత వారిని బలవంతంగా తిరుపతికి తరలించాల్సి వచ్చింది. కాగా, మద్యం తాగిన ఆ ఇద్దరు పాతనేరస్తులని, గతంలో వీరు తిరుమలలో హాకర్లు ఉండేవారిని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పవిత్రతను దెబ్బతీస్తున్న అనధికార వ్యక్తులు

ఉచిత భోజనం, వసతి సదుపాయాలకు తిరుమలలో కొదవ లేదు. ఈక్రమంలో చాలా మంది అనధికార వ్యక్తులు కొన్నేళ్లుగా ఇక్కడ తిష్టవేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు నామాలు పెట్టడం, దేవుని పటాలు, బొమ్మలు విక్రయిస్తూ రాత్రికి తిరుమలలోనే ఉండిపోతున్నారు. ఇలా తిరుమల కొండపై అనధికార వ్యక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. తిరుమల పవిత్రతకు విఘాతం కలిగించేలా రాత్రయితే మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. ఈనెల 13వ తేదీన కూడా కర్ణాటకకు చెందిన ఓ యువకుడు మద్యం తాగి మాడవీధుల్లోని అర్చకనిలయం సమీపంలో ఉన్న గ్యాలరీల్లో హల్‌చేసిన విషయం తెలిసిందే. ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పోలీసులకు కూడా మద్యం విక్రయిస్తానంటూ వీరంగం సృష్టించాడు. ఇదే క్రమంలో మరికొంతమంది కూడా తరుచూ భక్తులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారు. క్షేత్ర పవిత్రత, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు, భద్రతాధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.



పల్లె బస కార్యక్రమంలో ప్రజలతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

పల్లె బసకు పోలీసులు

- గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని.. నేరాల కట్టడి దిశగా అడుగులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు తగ్గించడానికి పోలీసు యంత్రాంగం వినూత్న ప్రణాళికలు సిద్ధం చేసింది. పల్లెలకు వెళ్ళి ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని తొమ్మిది సబ్ డివిజన్ల నుంచి ప్రతి రోజూ ఒక డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది కలిసి వారివారి పరిధిలోని గ్రామాలను సందర్శించాలి. అక్కడే ప్రజలతో సహపంక్తి భోజనం చేసి.. రాత్రి బస చేసి.. మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి శ్రీకారం చేపట్టాలని ఆదేశించారు. ఇలా ప్రతి రోజూ ఒక గ్రామాన్ని ఎంచుకుని రాత్రి బస చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 గ్రామాల్లో పోలీసులు రాత్రి బస చేసి నేరాలు తగ్గుముఖం పట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ మంచి సంబంధాలు కలిగి ఉండి గ్రామంలో నేరస్థులు, వారి కదలికలను, గ్రామాలకు కొత్తగా వచ్చే అనుమానితుల సమాచారం తెలుసుకుంటున్నారు. తద్వారా గ్రామాల్లో నేరాలు అరికట్టి శాంతి భద్రతల పరిరక్షణకు వీలుంటుందనే ఆలోచనకు శ్రీకారం చుట్టారు. అలాగే గ్రామాల్లో మధ్య వర్తులు, పెద్ద మనుషుల ప్రభావంపైనా దృష్టి పెడుతున్నారు. ఫిర్యాదుదారులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఉన్నత స్థాయి అధికారులను కలిసే వాతావరణం కల్పిస్తున్నారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై ప్రజలతో మాట్లాడి అవగాహన కల్పిస్తున్నారు. మహిళలపై దాడులు జరుగుతున్న సమయంలో వాటిని ఎలా ఎదుర్కోవాలో దానిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. యువతీ యువకులు చెడు మార్గాల్లో వెళ్లకుండా ఉండేందుకు వారికి మత్తు పదార్థాలపై చైతన్యం కల్పిస్తున్నారు. పోలీసుల రాత్రి బసవల్ల గ్రామస్థుల మధ్య వివాదాలు తగ్గించి స్నేహభావంతో మెలిగే విధంగా సహాయ పడుతున్నారు.

నిరంతర కార్యక్రమం: ఎస్పీ

పోలీసులు ప్రజలతో కలసి గ్రామాల్లో ఉండటం వల్ల సత్సంబంధాలు మెరుగుపడతాయని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. ఇప్పటి వరకు దాదాపు 100 గ్రామాల్లో రాత్రి బస కార్యక్రమాలు చేయడం వల్ల ఎన్నో మంచి పనులు జరగడంతో పాటు ప్రజల్లో పోలీసులంటే ఒక మంచి భావన, సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం జరుగుతుందని, తద్వారా ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందన్నారు. పోలీసులు నేరుగా ప్రజల చెంతకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో ఒక మంచి ఆలోచన, నమ్మకం కలుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

చెన్నై పరకామణిలో టీటీడీ ఉద్యోగి చేతివాటం

- అధిక విలువైన డాలర్ల నోట్లను నొక్కేసిన సీనియర్ అసిస్టెంట్
- వాటి స్థానంలో తక్కువ విలువైన వాటిని చేర్చిన వైనం
- పోలీసులకు అధికారుల ఫిర్యాదు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): చెన్నై శ్రీవారి ఆలయంలో టీటీడీ ఉద్యోగే చేతివాటం ప్రదర్శించాడు. దాదాపు రూ.6.74 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీ నోట్లను మాయం చేసినట్టు అధికారులు తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కృష్ణకుమార్ చెన్నై శ్రీవారి ఆలయం, సమాచార కేంద్రం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. గతేడాది అక్టోబరు 6వ తేదీన జరిగిన పరకామణి రిజిస్టర్‌లో కాలం సమస్య ఉందనే కారణంతో 950 విదేశీ కరెన్సీ నోట్లను నమోదు చేయలేదు. తిరిగి తర్వాత పరకామణి లెక్కింపు సమయంలో తిరిగి విదేశీ కరెన్సీ నోట్ల సంఖ్యను నమోదు చేశారు. అయితే గత పరకామణి లెక్కింపు జాబితాను, తాజా జాబితాను పోల్చిచూసినప్పుడు తేడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నిజానికి 950 నోట్లలో అధిక విలువైన డాలర్ నోట్లను మార్పిడి చేసి తక్కువ డాలర్ నోట్లను ఆస్థానంలో చేర్చినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. నోట్ల సంఖ్య కరెక్ట్‌గానే ఉన్నట్టు చూపించినప్పటికీ విలువను మాత్రం కృష్ణకుమార్ తన జేబులో వేసుకున్నట్టు విజిలెన్స్ అధికారులు ఫిబ్రవరి నెలలో జరిగిన విచారణలో గుర్తించారు. దాదాపు రూ.6.74 లక్షల కరెన్సీని చోరీ చేసినట్టు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈక్రమంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చెన్నై శ్రీవారి ఆలయ ఏఈవో పార్థసారధి ఇటీవల తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇప్పటికే కృష్ణకుమార్‌ను టీటీడీ సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

కోర్టు గడువు పూర్తి కాగానే బుగ్గమఠం భూముల జాయింట్ సర్వే

- ఆక్రమణలను గుర్తించి స్వాధీనానికి చర్యలు
- రెవెన్యూ, దేవదాయ అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బుగ్గమఠం భూముల వ్యవహారంలో రాష్ట్ర హైకోర్టు నిర్దేశించిన గడువు పూర్తి కాగానే ఆ మఠం భూముల ఆక్రమణలు తేల్చేందుకు జాయింట్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రెవెన్యూ, దేవదాయ శాఖల అధికారులను ఆదేశించారు. తిరుపతిలో బుగ్గ మఠానికి చెందిన అత్యంత ఖరీదైన 22 ఎకరాల భూములు కబ్జాకు గురికావడం, అందులో కొంత భూమి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధీనంలో ఉన్న సంగతి తెలిసిందే. పెద్దిరెడ్డి ఆక్రమణలో వున్న భూములను స్వాధీనం చేయాలని మఠం అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు భూములపై హక్కులు నిరూపించే రికార్డులు, ఆధారాలు వుంటే సమర్పించేందుకు రెండు వారాల పాటు గడువు ఇచ్చింది. ఆ వ్యవధి ఈనెల 23వ తేదీన ముగియనున్న నేపథ్యంలో మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో రెవిన్యూ, దేవాదాయ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మఠం భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 23వ తేదీన హైకోర్టు ఇచ్చిన గడువు ముగియగానే రెవిన్యూ, దేవాదాయ శాఖలు సంయుక్తంగా మఠం భూములపై సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మఠానికి చెందిన మొత్తం 22 ఎకరాల భూములు ఎక్కడెక్కడ, ఏ స్థితిలో వున్నాయో తొలుత నిర్ధారించాలని ఆదేశించారు. అందులో కౌలుదార్ల ఆధీనంలో వున్న భూములను ప్రస్తుతానికి మినహాయించి ఇతరులు ఆక్రమించుకున్న భూములపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇతరుల కబ్జాకు గురైన భూములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావు లేదని, అలాగే ఎలాంటి ఒత్తిడులూ వుండవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల చేతుల్లోని మఠం భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాల్సిందేనని ఆదేశించారు. తిరుపతి సహా జిల్లాలోని అన్ని ఆలయాలు, మఠాలకు చెందిన భూములనూ పరిరక్షించుకునే దిశగా కఠిన చర్యలకు ఉపక్రమించాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యంగా తిరుపతిలో భూముల విలువ అధికమని, ఖరీదైన దేవాదాయ శాఖ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై వుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, దేవాదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, బుగ్గమఠం ఈవో వెంకటేశ్వర్లు, తిరుపతి అర్బన్ తహసిల్దారు భాగ్యలక్ష్మి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ గోడౌన్ పరిశీలన

- పుత్తూరు మున్సిపాలిటీలో 2వ రోజు కొనసాగిన పునర్విచారణ

పుత్తూరు అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2వ రోజు కమిటీ సభ్యులు పునః విచారణ కొనసాగించారు. మంగళవారం కార్యాలయంలోని 2019-24 మధ్య చేపట్టిన అభివృద్ధి పనులు, కొనుగోలు చేసిన వాహనాలు, పారిశుధ్య సామగ్రి తదితర ఫైళ్లను పరిశీలించారు. అంతే కాకుండా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గోడౌన్‌ను పరిశీలించారు. అందులోని పైప్‌లు, మోటర్లు, ఇతర సామగ్రిని వెలికితీయించారు. గత కమిటీ కార్యాలయానికే పరిమితమైందన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రస్తుత కమిటీ ఆధ్వర్యంలో ప్రతీదీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారనేందుకు క్షేత్రస్థాయి పరిశీలన ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:26 (బుధవారం సాయంత్రం) సహర్: 4:58 (గురువారం ఉదయం)

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి

ప్లాట్లు అమ్మకము(Plots)

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థచే (తుడ) అభివృద్ధి పరచబడిన సూరప్పకశం గ్రామం పద్మావతినగర్ లేఔట్ నందు రెసిడెన్షియల్ ప్లాట్లు తేది: 26.03.2025 నుండి 01.04.2025 వరకు "e" వేలము ద్వారా విక్రయించబడును. వివరములకు www.tudaap.in ఫోన్ నెంబరు 0877-2225730 (ఉదయము 8.00గం॥ల నుండి రా.8.00గం॥ల వరకు శెలవు రోజులు సైతం). ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 20.03.2025

సం/- శ్రీమతి ఎన్.మౌర్య, IAS,
ఉపాధ్యక్షులు, తుడ, తిరుపతి



అన్నప్రసాదం ట్రస్టుకు రూ.పది లక్షలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందిస్తున్న తిరుపతికి చెందిన కేపీస్సీ టాకీస్ చైర్మన్ కేతన్ శివ ప్రీతమ్

ఆరుగురు ఇరిగేషన్ డీఈలకు పదోన్నతిపై బదిలీలు

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఆరుగురు డీఈలను ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. పిచ్చాటూరు ఇరిగేషన్ డీఈ జి.రామచంద్ర మూర్తిని సోమశిల లింక్ కెనాల్ అండ్ స్వర్ణముఖి బ్యారేజీ నెల్లూరు డివిజన్1కు ఈఈగా బదిలీ చేసింది. తెలుగుగంగ ప్రాజెక్టు వెంకటగిరి డీఈ ఎం.బాబురెడ్డిని వెంకటగిరి ఇరిగేషన్‌కు.. టీజీపీ నాయుడుపేట డీఈ సి.సి.రాజశేఖర్‌రెడ్డిని సోమశిల ప్రాజెక్టు ఆత్మకూరు డివిజన్ 4కు.. టీజీపీ డిజైన్స్ విభాగం తిరుపతి డీఈ పి.చంద్రశేఖరయ్యను అదే ప్రాజెక్టులో క్వాలిటీ కంట్రోల్ శ్రీకాళహస్తి డివిజన్ 3కి.. టీజీపీ బీఎన్ కండ్రిగ డీఈ బి.పెంచలయ్యను అనంతపురంలోని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ డివిజన్‌కు.. సోమశిల లింక్ కెనాల్ స్వర్ణముఖి బ్యారేజీ గూడూరు డీఈ పావులూరి చంద్రమోహన్ గాలేరు-నగరి ప్రాజెక్టు జమ్మలమడుగు డివిజన్4కు ఈఈగా బదిలీ చేశారు. చిత్తూరు వాటర్ సప్లై డీఈ జేవీ శివారెడ్డి శ్రీకాళహస్తి ఈఈగా బదిలీ అయ్యారు.

భర్త, ప్రియురాలికి పదేళ్ల జైలు

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్త, అతని ప్రియురాలికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పాతవేపకుప్పం గ్రామానికి చెందిన మమత, గోపి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అయితే గోపి అదే గ్రామానికి చెందిన భారతితో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యతో గొడవ పడేవాడు. ఈనేపథ్యంలో ఆమె 2018 ఫిబ్రవరి 19న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి ఎస్ఐ భాస్కర్ నాయక్ కేసు నమోదు చేశారు. అనంతరం వచ్చిన ఎస్ఐ సాదిక్ ఆలీ విచారణ వేగవంతం చేశారు. గోపి, భారతి చర్యల వల్ల మమత ఆత్మహత్యకు పాల్పడిందని న్యాయమూర్తి గురునాథ్ పేర్కొంటూ వారిద్దరికీ పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.84 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,824

తలనీలాలు సమర్పించినవారు: 25,674



మార్చి.. అప్పుడే మాడ్చి

- నిప్పులు చెరుగుతున్న సూర్యుడు
- అల్లాడిపోతున్న ప్రజానీకం





ఈ ఏడాది సూరీడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మార్చిలోనే ప్రతాపం చాటుతున్నాడు. సాధారణంగా మేనెలలో 40 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరేది. అలాంటిది మంగళవారం ఆమేరకు చేరుకోవడంతో జిల్లా ప్రజానీకం బెంబెలెత్తుతున్నారు. తిరుమలేశుడి దర్శనానికి తిరుపతి చేరుకునే భక్తులు అల్లాడిపోతున్నారు. ఇక, తిరుపతిలో ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోడ్లపై జనసంచారం పలచగా ఉంటోంది. అమ్మకాలు సాగడంలేదని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాంగణంలోని చెట్లనీడలో సేదతీరుతూ కనిపిస్తున్నారు. రూయా, మెటర్నరీ వైద్యశాలల వద్ద రోగులు,వారి బంధువులు చెమటలు కక్కుతూ నీడకోసం వెంపర్లాడుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులు, చిరు వ్యాపారులకు గరుడవారధి గొడుగులా మారింది. మరోపక్క ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నాపెద్దా తక్షణ ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. కర్బూజా అమ్మకాలు జోరందుకున్నాయి. ఇళ్లలో ఫ్రిజ్‌లున్నా సహజమైన చల్లదనం కోసం జనం కుండలపై ఆసక్తి చూపిస్తున్నారు. తిరుమల కొండ మీద భక్తులు ఎండవేడిమికి తాళలేక మాడవీధుల నుంచి నీడ కోసం పరుగులు తీస్తున్నారు.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

ఎండలతో జాగ్రత్త



వడదెబ్బ అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. వడదెబ్బ అవగాహన బ్యానర్లు, పోస్టర్లను మంగళవారం ఆయన తిరుపతిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో అవసరమైతే తప్ప ఎండలో బయటకు రాకూడదన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండ నుంచి రక్షణగా టోపీ, గొడుగులు వంటివి వాడాలన్నారు. నీటితో పాటు పళ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించి.. సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, వైద్యాధికారులు మధుబాబు, లావణ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరి మృతి



చెంగల్రాయులు (ఫైల్ ఫొటో)

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లెలో వడదెబ్బకు పూజారి చెంగల్రాయులు(65) మృతిచెందారు.మంగళవారం ఉదయం 10గంటలకు పొలం వద్దకు వెళ్లిన ఆయన.. మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి వచ్చారు. గుండె నొప్పిగా ఉందంటూ కుప్పకూలారు. 108 వాహనం ద్వారా తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. వడదెబ్బ వల్లే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అద్దెకు కారు తీసుకుని.. ఉడాయించిన ఘనుడు

- అరెస్టు చేసిన పోలీసులు
- మూడు కార్లు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): అద్దెకు కారు తీసుకున్నాడు. ఐదు రోజులు తిరిగి.. ఆపై ఉడాయించాడు. చివరకు ఇతడిని మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిన్న మిరానికి చెందిన మహేష్ నూతన కుమార్.. నకిలీ ఆధార్ కార్డు చూపించి ఈనెల 11న తిరుపతిలో ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. ఐదు రోజుల పాటు కారును వాడుకున్న తర్వాత.. కర్నూలు జిల్లా దాటి తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నాడు. అక్కడ కారుకు ఉన్న జీపీఆర్ఎస్ వైర్లు తొలగించాడు. తన మొబైల్ ఫోన్ స్విచ్ఆఫ్ చేశాడు. దీనిపై బాధితుడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రాంకిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ లోకేష్‌బాబు, సిబ్బంది కలిసి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. తిరుపతి జూ పార్కు రోడ్డులో వున్నట్లు గుగూల్ మ్యాప్ ద్వారా మంగళవారం గుర్తించి అతడిని అరెస్టు చేశారు. గతంలో జైపూర్, ఢిల్లీ ప్రాంతాల్లో జూమ్ కార్లు అద్దెకు తీసుకుని ఉడాయించినట్లు గుర్తించారు. ఇతడిపై కోల్‌కత్తా, ఢిల్లీ, హైదరాబాదు, చెన్నై, భీమవరం, ముంబై నగరాల్లో మొత్తం 24 కేసులు నమోదైనట్లు గుర్తించారు. గతంలో ఐదుసార్లు జైలు శిక్ష అనుభవించాడు. నిందితుడి జైపూర్, ఢిల్లీ, తిరుపతికి చెందిన మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారి బదిలీ

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలలో తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా పనిచేస్తున్న జి.గుణభూషణ్ రెడ్డి బదిలీ అయ్యారు. రెవిన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఆయన గతేడాది జనవరి 10వ తేదీన దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ అయి టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా నియమితులయ్యారు. తాజాగా ప్రభుత్వం ఆయనను టీటీడీ నుంచి బదిలీ చేసి కర్నూలు జిల్లా బీజీ రైల్వే విభాగం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జరిమానా లేదా జైలుకు పంపండి

- నాటుసారా నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఆదేశం



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయా తహసీల్దార్లు నాటుసారా నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.లక్ష జరిమానా లేదా జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నాటుసారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవోదయం 2.0' పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి.. జిల్లా ఎక్సైజ్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీ, అటవీ, వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ శాఖల అధికారులు మండల.. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచడానికి గ్రామసభలు నిర్వహించాలన్నారు. రాబోయే మూడు నెలల్లో తిరుపతిని నాటు సారా రహిత జిల్లాగా తయారు చేయడానికి కృషి చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో నిందితులకు పునరావాసం కల్పించి పరివర్తన తీసుకొస్తామని ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ చెప్పారు. నేరస్థులపై పీడీయాక్ట్ పెట్టి సారా వృత్తి నుంచి బయటపడేలా చర్యలు తీసుకుంటామని ఏసీ శ్రీనివాసాచారి చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్ భూసేకరణ పురోగతి పనులపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్‌గా అధికారులతో సమీక్షించారు.

తిరుమలలో సాధువుల ధర్నాపై పోలీసులు సీరియస్

- 118 మందిపై కేసులు నమోదు
- పునరావృతం కాకుండా చట్టాల కఠినతరానికి నిర్ణయం

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా సాధువులు ధర్నాకు దిగడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. ముందస్తుగా నోటీసులు జారీ చేసినప్పటికీ ఆలయ చట్టాలకు వ్యతిరేకంగా శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన 118 మందిపై బీఎన్ఎస్ ప్రివెంట్ అరెస్ట్ సెక్షన్ 151 కింద కేసులు నమోదు చేశారు. అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన జీవో నెంబరు 24ను రద్దు చేసి ఆ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం కేటాయించాలనే డిమాండ్‌తో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆయన అనుచరులు సోమవారం శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ధర్నాలో పాల్గొన్న 118 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ఆలయ చట్టాలను మరింత కఠినతరం చేయాలని పోలీసులు భావిస్తున్నారు. భక్తులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు విధుల్లోని సిబ్బందికి ఆటంకం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులపై ఇకపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని చోటుచేసుకునే అవకాశముందనే అంచనాతో ఆలయ చట్టాలను కఠినంగా అమలుచేయాలని భావిస్తున్నారు. కాగా, ఆదర్శంగా ఉండాల్సిన సాధువులే అల్లర్లు చేస్తే ఎలా? అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తిరుమలలో నిరసనకు దిగడం అపచారమని సాధువులకు తెలియదా? అని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ఇకపై గంట ముందే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండలకేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఎండల తీవ్రత దృష్ట్యా ఒక గంట ముందే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

శ్రీసిటీలో నేషనల్ డిఫెన్సు కళాశాల అధికారుల పర్యటన

శ్రీసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భారతదేశ పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్సు కళాశాలకు చెందిన 17మంది సభ్యుల బృందం మంగళవారం శ్రీసిటీలో పర్యటించింది. మేజర్ సి.పి.సంగ్రా నేతృత్వంలో భారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో విచ్చేశారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ, లాజిస్టిక్స్, ఏరో స్పేస్, డిఫెన్సు రంగాల్లో భాగస్వామ్యం గురించి వారికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. శ్రీసిటీ తర్వాత ఈ ప్రాంతంలో వచ్చిన మార్పులనూ తెలియజేశారు. శ్రీసిటీ పారిశ్రామిక విధానం, సులభతర వ్యాపారం, లాజిస్టిక్స్ సామర్థ్యం, సామాజిక వసతులు, భద్రత తదితర అంశాలపై ప్రతినిధి బృందం చర్చించింది. వికసిత్ భారత్ లక్ష్యంగా శ్రీసిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, క్రమశిక్షణ అద్భుతమంటూ టీం లీడర్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈ పర్యటన కోఆర్డినేటర్లుగా మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



శ్రీసిటీ గురించి వివరిస్తున్న ఎండీ రవీంద్రసన్నారెడ్డి

భక్తుల రక్షణ కోసం..

- తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ప్రధాన ఉద్యానవనాల్లో నీడ కోసం సిల్వర్‌ఓక్ వృక్షాలను టీటీడీ 1980లో ఏర్పాటు చేసింది. వీటి కాలపరిమితి 30 ఏళ్లు. ప్రస్తుతం తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఈ వృక్షాలు చిన్నపాటి గాలులు, వర్షాలతో నేలకూలుతున్నాయి. ఇప్పటివరకు కూలినచెట్ల కారణంగా అనేక వాహనాలు, నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భక్తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని జనసంచారంలో ఉండే కాలం చెల్లిన సిల్వర్‌ఓక్ చెట్లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఫారెస్ట్ విభాగాన్ని ఆదేశించారు. వీరు 839 కాలంచెల్లిన వృక్షాలను గుర్తించారు. కూలిపోయే స్థితిలో ఉన్నట్టు నిర్ధారించారు. వీటి కొమ్మలు, ఆకులు నిత్యం పడుతుండటంతో విశ్రాంతి భవనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొదలైన వీటి తొలగింపు పనులు.. మూడునెలల్లో పూర్తికానున్నాయి. వాటి స్థానంలో దాదాపు 40 రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే చెట్లను నాటాలని ఫారెస్ట్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.



తిరుమలలో తొలగించిన సిల్వర్‌ఓక్ వృక్షాలు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోండి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

గూడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎన్ఎంయూ నాయకులు అన్నారు. మంగళవారం డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో మేనేజర్ మొండి వైఖరి వల్ల ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళా కండక్టర్లకు చైల్డ్‌కేర్ లీవ్‌లు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గూడూరు నుంచి తిరుమల, బెంగళూరుకు బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అయినా ఇప్పటి వరకు బస్సుల ఏర్పాటుకు సంబంధించి నోట్‌ఫైల్ సిద్ధం చేయలేదన్నారు. ఇకనైన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, భాషా, శ్రీనివాసులు, వెంకయ్య, రమేష్, సుధాకర్, శేఖర్ తదితరులు

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోండి



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే బస్సు వద్ద వైద్యులు, సిబ్బంది

చిల్లకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు తప్పనిసరిగా మామోగ్రామ్, పాప్‌స్మియర్ పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని చిల్లకూర పీహెచ్‌సీ డాక్టర్ షోలోమ్ అరాఫత్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్, పురుషులకు నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండా రామచంద్రారెడ్డి, నెల్లూరు రామ్మూర్తి, మధు, సురేష్‌బాబు, బాలరమణయ్య, హెచ్ఎం జాన్ పీటర్, వైద్య సిబ్బంది రవికుమార్, మునిలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టిద్దాం: డీఎల్పీవో



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీఎల్పీవో రవీంద్రబాబు

పెళ్లకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించడం ద్వారా చెత్తతో సంపద సృష్టిద్దామని సూళ్లూరుపేట డీఎల్పీవో రవీంద్రబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరు తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో ఎమ్మెల్యే పాశం



క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న ఏపీ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్-2025 పోటీల్లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. మంగళవారం టగ్ ఆఫ్ వార్‌తో పాటు పలు క్రీడా పోటీల్లో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గూడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సాదుపేటలోని ఎస్సీ హస్టల్ ఆవరణలో ఏపీ ప్రజా కుల సంఘాల ఐక్యవేదిక, అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం ద్వారా ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే పేద, మధ్య తరగతి ప్రజతోపాటు ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అసెంబ్లీలో ప్రస్థావించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నెల్లూరులో కలపాలని, లేని పక్షంలో గూడూరును జిల్లా కేంద్రంగా మార్చాలన్నారు. కార్యక్రమంలో సర్దార్‌షఫీ, ఎల్వీ సుబ్బయ్య, గురునాధం, శేషయ్య, జీవన్, మహేష్, మనోహర్, గోవర్ధన్, సాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ జూడో చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

తిరుపతి(క్రీడలు), మార్చి 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగిన స్టేట్ జూడో చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. వివిధ విభాగాలలో రాణించిన శివసాయి(స్వర్ణ), మల్లికార్జున, హరి, శేఖర్, చాణిక్య, ఫాతిమ(రజతం), రాంబాలాజీ, బిందు(కాంస్య)పతకాలు కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను, కోచ్ గోపీని శాప్‌చైర్మన్ రవినాయుడు, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పీడీ ముస్తాక్, జిల్లా జూడో అధ్యక్షుడు కృష్ణమూర్తి, మనోజ్ అభినందించారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి

సూళ్లూరుపేట, మార్చి (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని అంబేడ్కర్ గురుకులం సమీపంలో ఓ చుక్కల దుప్పి సంచరిస్తుండగా స్థానికులు గమనించారు. జనాలను చూసిన దుప్పి పరుగెత్తుకుంటూ ఓ ఫ్యాన్సీ షాప్‌లోకి వెళ్లింది. అక్కడున్న వారు వన్యప్రాణి సంరక్షణ అధికారులకు సమాచారం ఇచ్చారు. వన్యప్రాణి సంరక్షణ అధికారులు వచ్చి దుప్పిని వాహనంలో తీసుకెళ్లి అడవిలో విడిచిపెట్టారు. వేసవి కావడంతో నీటికోసం దుప్పిలు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. మూడు రోజుల క్రితం కోళ్లమిట్టలో ఓ దుప్పి ఇళ్ల మధ్య తిరుగు తుండడంతో వన్యప్రాణి సంరక్షణ అధికారులు పట్టుకెళ్లారు.



ఫ్యాన్సీ షాపులో దుప్పి

మండుతున్న సూరీడు

ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు

సూళ్లూరుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో భగభగ మండుతున్న ఎండలతో ప్రజలు సమమతమవుతున్నారు. దీనికి తోడు ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. తాజాగా మంగళవారం 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ఎండ తీవ్రతకు జనం బయటకు రావడానికి బెంబేలెత్తిపోయారు. పట్టణంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వివిధ పనులపై పట్టణానికి వచ్చినవారు దాహార్తితో అలమటిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గత ఏడాది మార్చి నెల ఆరంభంలోనే పులపాలక సంఘ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మార్చి నెల మొదటి నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉంది. మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ఎండవేడిమితో ప్రజలు అల్లాడిపోతున్నారు. గుక్కెడు నీళ్ల తాగుదామన్నా చలివేంద్రాలు ఎక్కడ కనిపించడం లేదని బయట ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చినవారు ఆవేదన చెందుతున్నారు. చేసేదేమి లేక నీళ్ల బాటిళ్లు కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సూళ్లూరుపేట పట్టణంలో దాదాపు 57 వేల పైబడి జనాభా ఉన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం, చెన్నైకి దగ్గరగా ఉండడమే కాకుండా వ్యాపార కూడలి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలమంది ప్రజలు నిత్యం పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే శ్రీసిటీ, అపాచి పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు ఇక్కడే నివాసం ఉంటూ విధులకు వెళ్లి వస్తుంటారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండు, షార్ వై జంక్షన్, షార్ బస్టాండు, కచ్చేరివీధి కూడలి, బాపూజీ వీధిలోని గడియారం సెంటర్, కూరగాయల మార్కెట్, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, మన్నారుపోలూరు సర్కిల్, హోలీక్రాస్ సర్కిల్, పోలీస్ స్టేషన్ సమీపంలోని కూడళ్లలో నిత్యం ప్రజలతో కిటకిటలాడుతూ ఉంటాయి. ఎండ తీవ్రత పెరిగిపోవడంతో పట్టణానికి వచ్చే ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. బస్టాప్‌లు, ప్రధాన కూడళ్లలో నిల్చోవడానికి నీడలేక ఎండలోనే అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య మాట్లాడుతూ పట్టణంలోని రద్దీ కూడళ్లలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నిర్మానుష్యంగా ఉన్న పట్టణంలోని బాపూజీ వీధి

ప్రారంభానికి నోచుకోని రైతు భరోసా కేంద్రం

బాలాయపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. 2022లో రూ.21.8 లక్షల వ్యయంతో ప్రారంభమైన రైతు భరోసా కేంద్రం పనులు 2023లో పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడుస్తున్నా నేటికీ ప్రారంభించలేదు. వ్యవసాయ శాఖకు సొంత భవనం లేకపోవడంతో ఆ శాఖ సిబ్బంది కమ్యూనిటీ హాల్‌లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ భవనంలోనూ ఎంపీడీవో కార్యాలయ సామగ్రి భద్రపరచడంతో స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న భవనంలో రైతు సేవా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకుని వస్తే అధికారులకు, రైతులకు సౌకర్యంగా ఉంటుంది.



రైతు భరోసా కేంద్రం

ఫోన్‌పే ట్రాన్సెక్షన్‌తో రూ.40 వేలు టోకరా

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే ట్రాన్సెక్షన్‌తో రూ.40 వేలు టోకరా వేసిన ఘటన కోట మండలంలో వెలుగు చూసింది. మండల పరిధిలోని విద్యానగర్‌లో మోహన్‌రావు అనే వ్యక్తి బ్యాంకు ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈనెల 15వ తేదీన ఓ యువకుడు వచ్చి తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని, విజయవాడ నుంచి తమ వాళ్లు రూ.40వేలు మీ ఫోన్ చేస్తారని, ఆ మొత్తాన్ని నగదు రూపంలో తనకు ఇవ్వాలని కోరడంతో మోహన్‌రావు అంగీకరించాడు. వెంటనే ఆ యువకుడు ఓ మహిళకు ఫోన్ చేసి మోహన్‌రావుతో మాట్లాడించాడు. తరువాత విజయవాడకు చెందిన రమ్య అనే మహిళ రూ.40వేలు మోహన్‌రావుకు ఫోన్‌పే చేసింది. వెంటనే ఆ మొత్తాన్ని నగదుగా తీసుకున్న యువకుడు వెళ్లిపోయాడు. అదేరోజు 20 నిమిషాల తరువాత విజయవాడ నుంచి ఫోన్‌పే చేసిన రమ్య భర్త మోహన్‌రావుకు కాల్ చేసి ఫోన్‌తో మాట్లాడిన యువకుడు తమకు తెలియదని, పొరపాటున తన భార్య రూ.40వేలు ఫోన్‌పే చేసిందని, వెంటనే ఆ నగదును తిరిగి పంపాలని కోరాడు. అదేమీ తనకు తెలియదని, తనకు ఫోన్‌పే ద్వారా వచ్చిన రూ.40వేలు ఆ యువకుడు అప్పటికప్పుడే నగదు రూపంలో తీసుకువెళ్లాడని మోహన్‌రావు చెప్పారు. రమ్య దంపతులు విజయవాడలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో మోహన్‌రావుపై కేసు పెట్టడంతో అక్కడి పోలీసుల ఆదేశాల మేరకు కోట ఎస్ఐ పవన్‌కుమార్ మంగళ వారం మోహన్‌రావును విచారించారు.

'మాలల సత్తా చాటుదాం'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల్లాంటి మాల మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఎంతటి ఉద్యమాలకైనా వెనకడుగువేసే ప్రసక్తే లేదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు హెచ్చరించారు. కోట బజారు సెంటర్‌లో మంగళవారం హలో మాల - ఛలో తిరుపతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల గెజిటెడ్ ఆఫీసర్ అసోషియేషన్ తిరుపతి జిల్లా చైర్మన్ యంత్రపాటి శ్రీనివాసరావు, మాల జేఏసీ చైర్మన్ తాళ్లపాక రాములు మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా మాల మాదిగలకు సంక్రమించిన హక్కులు, రిజర్వేషన్ల కోసం ఉమ్మడి పోరాటాలు చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, అశోక్ కాంబ్లే, పాలా మల్లికార్జున్‌రావు, పనబాక హేమంత్, కేశవులు, భూపతిసాయి, కోటేశ్వరరావు, సురేష్, రాజమునీలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఓజిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకునే చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు లోనైన బోర్లకు మరమ్మతులు చేయించాలని ఊచించారు.

సొసైటీ రుణాల రికవరీపై దృష్టి

ఓజిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగొండ సొసైటీ పరిధిలోని రుణాల రికవరీపై దృష్టి పెట్టినట్లు సొసైటీ సీఈవో రవీంద్రబాబు అన్నారు. మంగళవారం సొసైటీ పరిధిలో గ్రామాల్లో అధికారులు పర్యటించి రుణాల రికవరీపై రైతులతో మాట్లాడారు. రైతులు సొసైటీ రుణాలను సకాలంలో చెల్లించాలని సీఈవో కోరారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని జాహ్నవిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ధనుంజయ రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధి

సూళ్లూరుపేట, మార్చి (ఆంధ్రజ్యోతి): భగవద్గీత మీద ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్యూ ఎడ్యుకేషనల్ కాంటెస్ట్ పోటీల్లో టైనీ టాట్స్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జాహ్నవి మొదటి స్థానంలో నిలిచింది. మంగళవారం జాహ్నవిని కరస్పాండెంట్ వేనాటి ధనుంజయరెడ్డి, ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెట్టిపాళెంకు చెందిన రాచకొండ హేమస్వరూప్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కవచ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుండు మనోజ్ కుమార్ మంగళవారం హేమస్వరూప్‌ను పరామర్శించి రూ 10వేలు ఆర్థికం సాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మునిరాజా, పల్లిపాటి సుబ్రహ్మణ్యం, బద్రి, వంశీ, రాజ్వాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇంత వరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్‌లో లబ్ధిపొందని వారి నుంచి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి స్థలం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోపు దగ్గరలో ఉన్న వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంతవరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్స్‌లో లబ్ధిపొందనివారు మాత్రమే అర్హులని తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీ ద్వారా(టిడ్కో హౌసింగ్, నవ రత్నాలు హౌసింగ్, దామినేడు, పాడిపేట, బాలాజీ డైరీ, తనపల్లి, వికృతమాల)సొంతంగా ఇల్లు నిర్మించుకున్న వారు అనర్హులన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు సబ్‌స్టేషన్‌లో ఈనెల 20వ తేదీ గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ చిన్నయ్య తెలిపారు. రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక కమిటీ సభ్యులు రామమోహన్ రావు, అంజలీకుమార్, విజయలక్ష్మి, ట్రాన్స్‌కో ఈఈ నరేంద్రరెడ్డి విద్యుత్ అదాలత్‌లో పాల్గొంటారని తెలిపారు. పరిష్కారం కాని తమ సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞలు



మీడియాతో మాట్లాడుతున్న మహాజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు దూడల పెంచలయ్య తదితరులు

డక్కిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ నివేదికను అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఆమోదించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాదిగ జాతి రుణపడి ఉంటుందని మాదిగ ఉద్యోగ సమాఖ్య సీనియర్ నాయకుడు, మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య అన్నారు. మంగళవారం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ మాదిగ జాతి పితామహుడు మందా కృష్ణ మాదిగ ఎటువంటి పదవులు ఆశించకుండానే 30 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాట ఫలితం ఇవాల పొందుతున్నామని చెప్పారు. మాదిగలందరూ తమ ఇళ్లక సీఎం చంద్రబాబు నాయుడు, మందా కృష్ణమాదిగ ఫొటోలను పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు మస్తాన్ మాదిగ, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతి, సంయుక్త కార్యదర్శి గోర్రిపాటి వీరయ్య, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అళఘునాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత అళఘునాథస్వామి

గూడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం, మాడవీధి ఉత్సవం జరిగింది. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం, పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా జరిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మన చేతుల్లోనూ సర్వేక్షణ్ ర్యాంకు..!

- కార్పొరేషన్ నిబంధనలు పాటిస్తే చాలు
- నగరంలో పర్యటిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్ బృందం

తిరుపతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బాగంగా తిరుపతి నగరం సుందరంగా సిద్ధమవుతోంది. ప్రభుత్వ, నగరపాలక సంస్థ, ప్రైవేట్ ఇళ్ల గోడలపైన దేవతామూర్తుల, కళాత్మక చిత్రాలు, స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తిరుపతి, పచ్చదనం -పరిశుభ్రత నినాదాలకు సంబంధించిన పెయింటింగులతో కొత్తకళ వచ్చింది. స్కూళ్లు, పార్కులు, బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, రైల్వే అండర్‌బ్రిడ్జి, ఎంఎస్ సుబ్బలక్ష్మి కూడలి, రామానుజ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు నుంచి అలిపిరి వరకు, ఎమ్మార్‌పల్లి ఆర్చి నుంచి బాలాజీ కాలనీ వరకు, టౌన్‌క్లబ్ నుంచి అలిపిరి వరకు అందమైన కలంకారీ బొమ్మలు కొలువుదీరాయి. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తిరుపతిని జాతీయ స్థాయిలో నిలిపేందుకు నగరపాలక సంస్థ, ప్రభుత్వ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటిస్తోంది. మెరుగైన పారిశుధ్యం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన లేకపోవడం, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, వాటి నిర్వహణ పనితీరు, సీనియర్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్, డాక్యుమెంటేషన్స్, చెత్త సద్వినియోగం వంటి వాటిని ప్రధాన ప్రామాణికంగా తీసుకుంటారు. బృందం పరిశీలనలో ఉన్నప్పుడు అమలవుతున్న తీరుపైనే మార్కులు ఉంటాయి.

అధ్వానంగా వేణుంబాక రోడ్డు



రాళ్లుతేలి గోతులు పడిన రోడ్డు

దొరవారిసత్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. జాతీయ రహదారికి లింకు రోడ్డు అయిన ఈ మార్గంలో పాలెంపాడు, గిరిజన కాలని, వేణుంబాక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. రోడ్డు అడుగడుగునా గోతులమయంగా ఉంది. పాలెంపాడు నుంచి మరింత దారుణంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వేణుంబాక రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 4.8 కిలోమీటర్ల దూరం ఉన్న వేణుంబాక రోడ్డు పనులు చేసేందుకు కోటి 80 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు చేపడతామని చెప్పారు.

డిప్యూటీ సీఎంను విమర్శిస్తే సహించం: జనసేన

పెళ్లకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదని ఆ పార్టీ మండల అధ్యక్షడు మల్లాం విజయ్ అన్నారు. మండలంలోని చెంబేడులో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాయుడుపేటకు చెందిన వైసీపీ నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డికి పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. తంబిరెడ్డి డిప్యూటీ సీఎంపై మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన



సవారిగుంట, మన్నెగుంట భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వెంకటగిరి టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ప్రభుత్వం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా స్థానిక సవారిగుంట, మన్నెగుంటలో ఆక్రమిత భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూములను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటవీశాఖ భూములకు హద్దులు చూపి నివేదిక సమర్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అమ్మవారిపేట, గొట్లగుంట, చిన్నగొట్ల గుంట కన్‌వర్షన్ లేఅవుట్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, మండల సర్వేయర్ సుప్రజ, అటవీశాఖ డీఆర్‌వో విజయ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది రాజశేఖర్, బాలు, అజయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు చేరాలి

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేర్చడంతో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో గోపి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సంక్షేమ పథకాల తీరుతెన్నులపై పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులతో సమీక్ష జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలో ప్రభుత్వ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఉద్యోగి అయినా నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపి